J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12


THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 42 సంచిక : 51 26.05.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# రాజకీయ సాము చేస్తున్న కాషాయ స్వాములు



## మఠాధిపతుల ఆశీస్సుల కోసం క్యూ కడుతున్న నేతలు

## పార్టీలపైన, నేతలపైన విమర్శలు చేస్తున్న స్వామీజీలు

'రాజదండం మట్టిగరిచినపుడు ధర్మదండం దానిని ఉద్ధరిస్తుంది' చాలాకాలం క్రిందట ఓ మహనీయుడు చెప్పిన మాట. భారత రాజకీయ వ్యవస్థలో పెద్దల సభగా రాజ్యసభను ఏర్పాటు చేయటం వెనుక ఉద్దేశం కూడా ఇదే.

లోక్‌సభ ఐదేళ్ళకు ఓసారి రద్దైతే... రాజ్యసభ మాత్రం కొనసాగుతూనే ఉంటుంది. కొందరు సభ్యులు పదవీ విరమణ చేస్తే... మరి కొందరు ఆ స్థానంలోకి వస్తారు. రద్దు కాకుండా కొనసాగుతూనే ఉంటుంది. ఆ సంగతి అలా ఉంచితే, చరిత్రలో అరాచక పాలన కొనసాగినప్పుడు ఎందరో మహర్షులు ఆ పరిస్థితిని చక్కదిద్దిన సందర్భాలు ఉన్నాయి. మత్స్యేంద్రుడు అనే మహనీయుడు ఓ రాజు శరీరంలోకి వెళ్ళి ధర్మాన్ని ఉద్ధరిస్తే, జగద్గురు ఆదిశంకరులు సైతం అదే మార్గంలో రాజధర్మాన్ని లోకానికి చాటి చెప్పిన విషయం లోకవిదితం. మహమ్మదీయ రాజులు దేశాన్ని అల్లకల్లోలం చేస్తున్న సమయంలో హిందూరాజ్య స్థాపన కోసం రత్నాల వర్షం కురిపించి, హరిహరరాయలు, బుక్కరాయలు ద్వారా విజయనగర సామ్రాజ్యానికి బాటలు వేసిన విద్యారణ్యస్వామి కథ చరిత్ర గురించి తెలిసిన

10లో

# 'రియల్' కుబేరులు

## మొదటి వందలో మళ్ళీ మనోళ్ళు

- 10 మంది తెలుగోళ్ళుంటే.. వాళ్ళలో 7మంది నెల్లూరోళ్ళే!
- టాప్ 50లో సీవీ రెడ్డి, ఎస్.ఎస్.రెడ్డి, మనోజ్ నంబూరు, బొమ్మిరెడ్డి కుటుంబం
- 78వ స్థానంలో జీ.వీ.కే.రెడ్డి


సీవీ రెడ్డి

సొంత ఇల్లు సామాన్యుడి కల. అలాంటి లక్షలాది మంది సామాన్యుల కలలను నిజం చేయగలగడం అసామాన్యం, అనితర సాధ్యం. అలాంటి అసామాన్యమైన పనిని సాధిస్తూ, అనితరసాధ్యులుగా నిలుస్తూ, రియల్ ఎస్టేట్ మరియు నిర్మాణ రంగంలో భారతదేశంలోనే మొదటి వంద 'రియల్' కుబేరులలో మూడేళ్ళుగా స్థానం సంపాదించుకుంటున్నారు మన నెల్లూరీయులు.



ఎస్.ఎస్. రెడ్డి

గ్రోహే –హురున్ ఇండియా అనే సంస్థ భారతదేశ వ్యాప్తంగా ఉన్న రియల్ – నిర్మాణ రంగంలో ఉన్న సంస్థలపై చేసిన సర్వేలో టాప్ వంద మంది కుబేరులలో తెలుగువారు పదిమంది ఉంటే... వాళ్లలో 7మంది మన నెల్లూరోళ్ళు కావడం విశేషం! గర్వకారణం కూడా.

గ్రోహే – వరున్ ఇండియా ప్రతీ ఏటా ఈ సర్వే నిర్వహిస్తుంది. ఆర్థిక వార్షిక ఏడాది ముగింపు తేదీ మార్చి 31 వరకూ దేశవ్యాప్తంగా ఉన్న రియల్ ఎస్టేట్ – నిర్మాణ రంగంలో ఉన్న సంస్థలు, వ్యక్తుల వివరాలు సేకరించి ర్యాంకుల జాబితా విడుదల చేస్తుంది. తాజాగా ఆ సంస్థ ప్రకటించిన వివరాల ప్రకారం అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ సారధులు చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి 5,940 కోట్ల

12లో


మనోజ్ నంబూరు



# 70 ఏళ్ళ గూడూరు 'సంస్కృతీ సమ్మేళనం'

## ఆకట్టుకున్న నాటికల పోటీలు

***ఆలంకారికులు 'కావ్యేషు నాటకం రమ్యమ్' అన్నారు. సాహిత్య ప్రక్రియల్లో నాటకానికున్న ప్రాధాన్యత అంతటిది. అలాంటి నాటక ప్రక్రియకు పట్టం కట్టి, 70ఏళ్ళుగా నాటికల పోటీలను నిర్వహిస్తూ, కళారాధనకు తనవంతు సేవలందిస్తోంది గూడూరు 'సంస్కృతీ సమ్మేళనం' సంస్థ.***

1954లో సిద్ధారెడ్డి జనార్ధనరెడ్డి, గండవరం సుబ్బరామిరెడ్డి, ఆవుల శ్రీనివాసరావు, చెన్నూరు కృష్ణమూర్తి, వై.యస్.రమణమూర్తి, కొండూరు వెంకటసుబ్బయ్యలు ఈ సంస్థను స్థాపించారు. అప్పటినుండి కార్యక్రమాల నిర్వహణలో డి.వి.శేషయ్య, అయితా బలరామయ్య, కె.వి.రమణారెడ్డి, బి.వి.కృష్ణయ్య, డా. పి.వి.వేణు, సి.యస్.రాయలు, బి.రంగాచారి, డా. వై.జె.ప్రభాకర్‌రెడ్డి, అల్లూరు రంగారెడ్డి మొదలైనవారు ప్రముఖపాత్ర వహిస్తూ సంస్థ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డారు.

పసుపులేటి సిద్ధయ్యనాయుడు, పూడి వీరరాఘవయ్య, డి.యస్.రెడ్డి, పెల్లేటి వెంకటకృష్ణారెడ్డి, పొన్నలూరు కోటారెడ్డి, పొన్నలూరు వీరరాఘవరెడ్డి, అల్లారెడ్డి శ్యామసుందరరెడ్డి, కోడూరు సుబ్బరామిరెడ్డి, సి.ఆర్.రావు, సి.వి.కృష్ణయ్య, దొడ్ల భాస్కరరెడ్డి, అల్లూరు ఆదిశేషారెడ్డి, కెప్టెన్ డా. యస్.రామచంద్రరావు, పొన్నలూరు సనత్‌కుమార్‌రెడ్డి, పి.వి.సుబ్బారెడ్డి, డా. సి.ఆర్.రెడ్డి, పెల్లేటి రాజారామిరెడ్డి, ఓ. జనార్ధనరావు, గుద్దేటి అబ్బయ్య లాంటి దాతల ఆర్థిక సహాయ సహకారాలతో సంస్థ 70ఏళ్ళ పాటు మనగలిగింది. నాటక కళారంగాన తెలుగు రాష్ట్రాలలో అగ్రగామిగా నిలిచింది.

ప్రతి ఏటా జరిగినట్లే ఈ ఏడు కూడా నాలుగు రోజుల పాటు నాటికల పోటీలు జరిగాయి. ముగింపు కార్యక్రమానికి ప్రముఖ సినీనటుడు భానుచందర్ విచ్చేశారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీ, మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, పనబాక కృష్ణయ్య, వాకాటి నారాయణరెడ్డి, యం.సూర్యనారాయణరెడ్డి, కనుమూరు హరిశ్చంద్రారెడ్డి హాజరయ్యారు. ప్రదర్శించిన అన్ని నాటికలూ ప్రస్తుత సమాజాన్ని అద్దంపట్టి చూపించాయి.

### విజేతలు వీరే...

నాటిక పోటీల ఫలితాలలో 'అతీతం' ఉత్తమ ప్రదర్శనగా నిలవగా, 'కొత్త పరిమళం' ద్వితీయ, 'థింక్' తృతీయ ఉత్తమప్రదర్శనలుగా నిలిచాయి. ఉత్తమ నటుడుగా 'అతీతం' రవీంద్రరెడ్డి, ద్వితీయ ఉత్తమ నటుడుగా 'థింక్' సంతోష్‌కుమార్, ఉత్తమ నటిగా 'అతీతం' లక్ష్మి, ద్వితీయ ఉత్తమ నటిగా 'చీకటిపువ్వు' లహరి, ఉత్తమ ప్రతినాయకుడుగా 'కొత్త పరిమళం' చలం, ఉత్తమ హాస్య నటుడుగా 'పక్కింటి మొగుడు' యు. శేషయ్య, ఉత్తమ సహాయనటన 'నాన్నా, నేనొచ్చేస్తా' అమృత వర్షిణి, ఉత్తమ దర్శకునిగా 'అతీతం' రవీంద్రరెడ్డి, ఉత్తమ రచయితగా 'నాన్నా నేనొచ్చేస్తా' తాళబత్తుల, ఉత్తమ రంగాలంకరణ 'అతీతం' శివ, ఉత్తమ ఆహార్యం 'కొత్త పరిమళం' రమణారావు, ఉత్తమ నేపథ్య సంగీతం 'అతీతం' లీలామోహన్‌లు దక్కించుకోగా, జ్యూరీ అవార్డులు బైరాగి, సిద్ధార్థ్, శ్రీరామ్, డా. గోపాల్, సీతలకు లభించాయి. ఏదేమైనా, 70 ఏళ్లపాటు ఒక కళాసంస్థను నిర్వహిస్తూ, నాటక కళకు ఊపిరిలూదుతున్న గూడూరీయులు అభినందనీయులు.



# సమస్యలు తీర్చాలంటూ నేతన్నల ఆందోళన


జిల్లాలోని చేనేతకారుల సమస్యలు తీర్చాలంటూ ఈనెల 20న నెల్లూరులో చేనేత జౌళిశాఖ కార్యాలయం వద్ద చేనేతకారులు ధర్నాందోళన నిర్వహించారు. చేనేత కార్మికుల సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది. కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న నేతన్న నేస్తం పథకం నేతన్నలందరికీ వర్తింపజేయాలని కోరారు. నెల్లూరులోని గాంధీనగర్ వద్ద నున్న ఆప్కో స్థలాన్ని పరిరక్షించాలని, అక్కడ చేనేత పార్కును ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ఆందోళనలో సంఘం నాయకులు రఘురామయ్య, శుభకుమార్, సుధాకర్, మురళి, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

# అరాచకాలు పెరిగిపోయాయ్

రాష్ట్రంలో అరాచకాలు పెరిగిపోయాయని, అభివృద్ధి కుంటుపడిపోయిందని, వైకాపా ప్రభుత్వంలో అవినీతి, అన్యాయాలు పెరుగుతున్నాయే తప్ప తరగడం లేదని, 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' అంటూ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం టిడిపి అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ దుయ్యబట్టారు. ఈనెల 20న ఆయన నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నెల్లూరు నగరంలో టిడిపి హయాంలో భూగర్భ డ్రైనేజీ పనులు 90 శాతం వరకు జరిగాయని, అవి పూర్తిచేస్తే టిడిపికి ఎక్కడ పేరొస్తుందోనని వైకాపా ప్రభుత్వం వచ్చాక ఆ పనులను నిలిపివేశారని ఆయన విమర్శించారు. నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జన్ని రమణయ్య, మధు, రాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏల విజ్ఞాపన

వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని, తమకు పే-స్కేలు అమలు చేయాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల ఐక్యసంఘం డిమాండ్ చేసింది. ఈనెల 20న నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్రి వెంకటేశ్వర్లు మాట్లాడారు. అర్హులైన వీఆర్ఏలకు ఉద్యోగోన్నతి కలిగించాలని, నామినీలుగా పనిచేస్తున్న వీఆర్ఏలను రెగ్యులర్ వీఆర్ఏలుగా గుర్తించాలని, ఆ మేరకు ఇటీవల కావలికి వచ్చిన ముఖ్యమంత్రికి వినతిపత్రం కూడా సమర్పించామన్నారు. నారయ్య, వినయ్‌కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# జన్మభూమికి.. డాక్టర్ ప్రేమ్ సేవలు



- స్వగ్రామం నిడిగుంటపాళెంలో..ఉచిత కంటివైద్య శిబిరం
- జూన్ 4 నుంచి ప్రారంభం కానున్న నేత్రచికిత్సలు

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ'..అన్నారు పెద్దలు. జన్మనిచ్చిన తల్లి, జన్మభూమి ఇవి రెండూ స్వర్గం కంటే కూడా గొప్పవని అర్థం. కన్నతల్లికి, పుట్టినగడ్డకు ఏమిచ్చి మనం రుణం తీర్చుకోగలం?.. జన్మనిచ్చిన తల్లికి, జన్మభూమికి సేవ చేసుకోవడం కంటే భాగ్యం ఏముంటుందీ?..అందుకే విజ్ఞులైనవారు జననిని, జన్మభూమిని ప్రాణసమానంగా భావిస్తూ, జీవితాంతం సేవలు చేసుకుంటుంటారు. ఆ కోవలోని వారే డాక్టర్ ప్రేమ్‌రెడ్డి దంపతులు. నెల్లూరుసీమలో పుట్టి, అగ్రరాజ్యం అమెరికాలో నివసిస్తూ, వైద్యరంగంలో అనితరసాధ్యమైన సేవలందిస్తూ ప్రపంచవ్యాప్త ఖ్యాతినందుకుంటున్న ప్రముఖ వైద్యులు, మన నెల్లూరు ముద్దుబిడ్డ, డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి తన పుట్టిన ఊరైన నిడిగుంటపాళెం అభివృద్ధికి ఎంతోకాలంగా కోట్లాదిరూపాయలు నిధులిస్తూ, జన్మభూమిపై తనకున్న ప్రేమాభిమానాలను చాటుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే నెలలోనే నిడిగుంటపాళెం గ్రామ ప్రజలకు, అధునాతన సౌకర్యాలు అందుబాటులో లేని గ్రామీణ ప్రాంతాల వారికి అత్యున్నతమైన ఆధునిక యంత్రపరికరాలతో, వైద్యరంగంలో సాటిలేని వైద్యనిపుణులతో, పూర్తిగా ఉచితంగా కంటివైద్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి, ఆయన సతీమణి డాక్టర్ శాంతిరెడ్డిల ఔదార్యానికి, దాతృత్వానికి.. వారి మానవీయ సేవాభావానికి ఓ మచ్చుతునక. వివరాలిలా ఉన్నాయి.

ప్రఖ్యాత వైద్యులు, అమెరికాలో ఉంటూ ప్రపంచ వైద్యరంగంలో విశేష ఖ్యాతిగన్న డాక్టర్ ననమాల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, ఆయన సతీమణి డాక్టర్ శాంతి ప్రేమ్‌సాగర్‌రెడ్డిల నేతృత్వంలో, డాక్టర్ ప్రేమ్ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో, చెన్నై శంకరనేత్రాలయం వారి సారథ్యంలో డాక్టర్ ప్రేమ్ స్వస్థలమైన వెంకటాచలం మండలం నిడిగుంటపాళెం గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో ఈ వైద్యశిబిరం నిర్వహించనున్నారు. జూన్ 4 నుంచి 11వ తేది వరకు నిర్వహించే 'ఉచిత కంటిపొర చికిత్స శిబిరం'లో రోగులకు ఇవ్వనున్న మందులు, నిర్వహణ వ్యయం, ఆపరేషన్ ఖర్చులు అన్నీ డాక్టర్ ప్రేమ్ దంపతులవే. అందులోనూ, ప్రపంచ ప్రసిద్ధి చెందిన మొబైల్ సర్జికల్ యూనిట్ కలిగిన శంకర నేత్రాలయ కంటి వైద్యశాల–చెన్నై వారి సహకారంతో ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ప్రసిద్ధిచెందిన వైద్యనిపుణులచే రోగులకు అత్యుత్తమ వైద్యచికిత్సలు చేయించి, తమ ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు ప్రసరింపజేయాలన్నదే డాక్టర్ ప్రేమ్ ప్రధానోద్దేశం.



### జూన్ 7 నుంచి కంటి ఆపరేషన్లు :

ఈ ఉచిత కంటి పొర చికిత్సా శిబిరం ప్రతిరోజు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని, కంటిశుక్లం (పొర) ఉన్నవారికి మాత్రమే ఈ శిబిరంలో ఆపరేషన్ చేస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ ఆపరేషన్లు జూన్ 7వ తేది బుధవారం నుంచి ప్రారంభమవుతాయని, 12వ తేది శుక్రవారం వరకు నిర్వహిస్తారని వారు పేర్కొన్నారు. చికిత్సకు వచ్చినవారికి ఆపరేషన్, ఐఓఎల్ లెన్స్, మరియు కళ్ళద్దాలు, మందులు ఉచితంగా ఇస్తామని, బీపీ, షుగర్ ఇతర వ్యాధులున్న వారు కంటిచికిత్సకు వచ్చేటప్పుడు, వాళ్లు వాడుతున్న మందులు తప్పకుండా తీసుకురావాలని నిర్వాహకులు ఈ సందర్భంగా సూచించారు. కంటి చికిత్సలు అధునాతన పద్ధతిలో చేస్తారని, ఆపరేషన్ జరిగిన తర్వాత కేవలం 2 గంటల్లోనే రోగులు హాయిగా ఇంటికి వెళ్ళవచ్చని తెలిపారు. ఈ చికిత్సలన్నీ పూర్తిగా ఉచితమని, ఇందులో ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, ఈ సేవలన్నీ డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి, డా.శాంతిల కుటుంబం (యుఎస్‌ఏ) ద్వారా ప్రజలకు ఉచితంగా అందజేస్తున్నామని వారు వివరించారు. ఈ చికిత్సలకు వచ్చేవారు తప్పనిసరిగా వారి ఆధార్ కార్డు జెరాక్స్ తీసుకునిరావాలని, ఫోన్ నెంబరు తెలియజేయాలని సూచించారు. వివరాలకు 6380515583, లేదా 98400 87389, 8668147829 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# తమిళనాట మైనార్టీభాషలకు.. ఘనవిజయం

## మాతృభాషలో చదువుకునేందుకు.. విద్యాశాఖ సూత్రప్రాయంగా అంగీకారం

ఎట్టకేలకు తమిళనాడులో తెలుగువారు, ఇతర మైనార్టీ భాషల వారు తమ మాతృ భాషల్లో చదువుకునేందుకు ఆచార్య సిఎంకె రెడ్డి చేస్తున్న పోరాటం ఇప్పుడిప్పుడే ఒక కొలిక్కి వస్తోంది. ఇటీవల తమిళనాడు విద్యా శాఖ జీఓ నెం.5051/22/05/2023లో మొట్టమొదటిసారిగా మైనార్టీల వారు వారి మాతృభాషను పాఠశాలల్లో చదువుకునే రాజ్యాంపరమైన హక్కును అంగీకరించిందని, ఇదెంతో సంతోషకరమైన విషయమని, తెలుగు వారి హక్కుల కోసం ఎంతోకాలం నుంచి అవిశ్రాంత పోరాటం చేస్తున్న మన నెల్లూరీయులు, మైనార్టీ భాషల పోరం–తమిళనాడు అధ్యక్షులు ఆచార్య సిఎంకె రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.కె షబ్బీర్‌అహ్మద్‌లు తెలియజేశారు. 'తమిళం మొదటిభాషగా చదవని విద్యార్థులు, అందరూ దానిని అదనపు భాషగా కచ్చితంగా చదవాల్సి ఉంటుందని' తమిళనాడు విద్యాశాఖ ఈ సందర్భంగా సూచిస్తోందని, అయితే, వాస్తవానికి మనమెప్పుడూ తమిళం చదువుకునేందుకు అభ్యంతరం చెప్పలేదని వారు పేర్కొన్నారు. పాఠశాలల్లో మన మాతృభాషను కచ్చితంగా చదువుకునేలా సిలబస్‌లో ప్రవేశపెట్టాలనేదే తమ ప్రధానమైన కోరిక అని స్పష్టం చేశారు. తాజాగా, తమిళనాడు విద్యాశాఖ ఆమేరకు సూత్రప్రాయంగా అంగీకారం తెలుపుతూ ఆ జీఓ ఇచ్చిందంటే, సుప్రీమ్‌కోర్టు మధ్యంతర ఉత్తర్వులే అందుకు కారణమని వారు అభిప్రాయపడ్డారు. ఏదేమైనా, వచ్చే జులైలో సుప్రీంకోర్టులో వచ్చే తుది నిర్ణయంతోనే మన మాతృభాషా సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నామని వారు వివరించారు.



ఆచార్య సిఎంకె రెడ్డి

# నేత్రదానం



నెల్లూరు, స్టోన్‌హౌస్‌పేట రేబాలవీధికి చెందిన సిహెచ్ రుక్మిణమ్మ (85) ఈనెల24న స్వగృహంలో మృతిచెందారు. రుక్మిణమ్మ కోరిక మేరకు మరణానంతరం, వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను(కార్నియా) దానం చేశారని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డా.ఎం.శర్వాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఏసిఎస్‌ఆర్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నేత్రదాన ప్రేరేపకులు బాలాజీసింగ్, ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రి టెక్నీషియన్ బి.లాలేష్‌లు ఆమె నేత్రాలను సేకరించి, నేత్రదానం సర్టిఫికెట్‌ను వారికి అందజేయడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. నేత్రదాన మోటివేటర్ బయ్యా ప్రసాద్ సకాలంలో సమాచారం అందించి రుక్మిణమ్మ నేత్రాలను సేకరించడంలో సహకరించారని తెలిపారు. మరణానంతరం నేత్రదానం చేసేందుకు 9948164781 (లాలేష్), 9347111033 (బాలాజీ)ల ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

35 Years of Academic Excellence.... ESTD : 1988

VISWASAI
Dr.SRK.SCHOOL

(Recognised by the Govt of A.P)
Magunta Layout, MSR Nagar, Nellore - 524 003.
Cont: 0861–2325199, Cell: 9951125173, 8977178176.
www.drsrkschools.com

Play Class to X Class

Why Choose Viswasai Dr. SRK School?

- Comfortable timings (8:40 AM to 4.40 PM).
- Well Experienced Staff.
- Stress free Education.
- Spacious Play ground, Lab, Library, Digi Lab, Computers, Sports, Games, Cultural and Literary Activities.
- Special emphasis on Communication Skills.
- All round development of the child.

Enquire, Visit, Know the facts and Decide

Admissions are opened for 2023 – 24.

# స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టుల్లో.. రూ. వేల కోట్ల కుంభకోణం

## మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి ఆరోపణలు

స్మార్ట్ మీటర్లు, ట్రాన్స్ ఫార్మర్ల కాంట్రాక్టులు వైఎస్ అవినాష్‌రెడ్డి బినామీ కంపెనీ అయిన షిరిడీ సాయి కంపెనీకి కట్టబెట్టడంలో రూ.29 వేల కోట్ల కుంభకోణానికి తెర లేపారంటూ మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. ఈనెల 24న ఆయన మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పలు ఆరోపణలు చేశారు. కడపలోని షిరిడీ సాయి కంపెనీ కార్యాలయంలో వైఎస్ అవినాష్ రెడ్డి, ఎస్పీడీసీఎల్ సీఎండీ సమక్షంలోనే ఆ మేరకు ఒప్పందం జరిగిందని, దేశంలో స్మార్ట్ మీటర్ విలువ రూ.10 వేల లోపే ఉండగా, ఎస్పీడీసీఎల్ పరిధిలో రూ.36,975గా నిర్ణయించడంలో మతలబు ఏమిటని ఆయన ప్రశ్నించారు. మీటర్ రీడింగ్ భారాన్ని కూడా నెలకు రూ.5.30 నుంచి రూ.153కి పెంచేస్తున్నారని, ఈపీడీసీఎల్ పరిధిలోనూ నామమాత్రపు పోటీతో షిరిడీ సాయి కంపెనీకే స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టు కట్టబెట్టారని ఆయన విమర్శించారు. సీబీఐ రంగంలోకి దిగి గూగుల్ టేకవుట్ ఆధారంగా వివరాలు సేకరిస్తే కడపలో జరిగిన సమావేశాల గుట్టు బయటపడటం ఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఐదు కోట్ల ప్రజలను ఈ భారీ స్కామ్ భారం నుంచి విముక్తుల్ని చేయాలని కోరుతున్నామని ఆయన అన్నారు. వ్యవసాయంలో కీలకమైన ట్రాన్స్ ఫార్మర్ల సరఫరాలో ఆలస్యం జరిగితే రైతులు ఇబ్బందులు పడతారన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఒక్క షిరిడీ సాయి కంపెనీపైనే పెనాల్టీలను రద్దు చేయడంతో పాటు ట్రాన్స్ ఫార్మర్ రేట్లను అడ్డుఅదుపూ లేకుండా పెంచేశారని ఆరోపించారు. తమ్ముడి కళ్లలో ఆనందం చూడటానికే ఈ భారీ స్కామ్‌కు జగన్‌రెడ్డి తెరలేపారంటూ ఆయన ఆరోపించారు. పవర్ ఫైనాన్స్ కార్పోరేషన్ ఈ కుంభకోణం విషయంలో తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.



లాయర్
మే 26, 2023

# ద్వీపకల్ప దేశాలకు భారత్.. ఓ భరోసా!

'మోడీ ది బాస్..ఆయన ప్రపంచంలో ఎక్కడకు వెళ్ళినా రాక్‌స్టార్ తరహా ఆదరణ లభిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశ స్ఫూర్తిని మా దేశానికి తీసుకువచ్చి మా పునాదులను మరింత బలోపేతం చేసినందుకు నా ప్రియ స్నేహితుడికి ధన్యవాదాలు''...ఈ మాటలన్నది ఎవరో కాదు, సాక్షాత్తూ ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని ఆల్బనీస్. భారత ప్రధాని నరేంద్రమోడీ విదేశీపర్యటనలో భాగంగా ఇటీవల ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఉన్న ఖుడోస్ ఎరీనాలో దాదాపు 21వేల మంది ప్రవాసభారతీయులు హాజరైన సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆల్బనీస్ ప్రశంసలు ప్రపంచవ్యాప్తంగా మార్మోగిపోయాయి. వాస్తవానికి భారత్ అన్నా, మోడీ అన్నా ప్రపంచంలో ఇప్పుడు ఒక ప్రత్యేక స్థానం ఏర్పడింది. ప్రత్యేకించి భారత ప్రధాని మోడీ అంటే ఏ దేశంలో చూసినా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. మోడీని చూడాలన్న ఆరాటం, ఆయన మాటలు వినాలన్న కుతూహలం..మొత్తంగా ప్రపంచదేశాల్లో మోడీపై మరింత క్రేజ్ పెరిగిపోయింది. 'మోడీ ది బాస్', 'మోడీ ది లీడర్' అంటూ పలు దేశాధినేతలు సంతోషంగా మాట్లాడుతుండడం, పెద్దపెద్ద దేశాల వాళ్ళంతా మోడీతో ఆత్మీయ ఆలింగనాలు చేసుకోవడం..మోడీ పట్ల వారికున్న అభిమానాన్ని చాటుతోంది. అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ వంటి అగ్రదేశాల్లోనూ మోడీ అంటే అభిమానం వెల్లువెత్తుతోంది. మోడీ దార్శనికత, సమస్యల పరిష్కారం పట్ల ఉన్న ముందుచూపు, ప్రపంచదేశాల పట్ల అవగాహన వంటి వాటితో పాటు, జంకు గొంకు లేకుండా కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడడం, అనుకున్న లక్ష్యాల సాధనకు వెనుకంజవేయకుండా ముందుకు సాగడం వంటి లక్షణాలతో మోడీ నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలందుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల మోడీ జరిపిన విదేశీయాత్ర దిగ్విజయమైంది. జపాన్‌లో హిరోషిమా, నాగసాకిలో జరిగిన జీ-7 దేశాల శిఖరాగ్ర సమావేశాలకు మోడీ హాజరు కావడం, మోడీ ప్రసంగాలకు అక్కడి నాయకులు, ప్రజలు సంతోష సంరంభాలతో జేజేలు కొట్టడం జరిగాయి. ముఖ్యంగా పసిఫిక్ ద్వీపకల్ప దేశాలకు భారత్ మద్దతుగా నిలుస్తుందంటూ ప్రధాని మోడీ ఇచ్చిన భరోసాతో ఆ దేశాల ఆనందం అంతాఇంతా కాదు. 14 పసిఫిక్ ద్వీపకల్ప దేశాలు పాల్గొన్న సదస్సుకు ప్రధాని మోడీ అధ్యక్షత వహించడం అపూర్వం. అంతర్జాతీయ వేదికపై భారత్ నాయకత్వాన్ని పపువా న్యూగినియా ప్రధాని జేమ్స్ మరాపే కొనియాడడం విశేషం. 'దక్షిణాది ప్రపంచానికి మీరే నేత..అంతర్జాతీయ వేదికలపై మీ అడుగుజాడల్లో మేం నడుస్తాం' అంటూ న్యూగినియా ప్రధాని అన్నప్పుడు సభలో ఉన్న అశేష ప్రజానీకం కరతాళధ్వనులు చేశారు. అంతేకాదు, ఫిజి-పపువా న్యూగినియా దేశాలకు చెందిన అత్యున్నత పురస్కారాలతో ప్రధాని మోడీని ఘనంగా సత్కరించారంటే, భారత్‌కు అదొక అపురూపమైన గౌరవమని వేరే చెప్పనక్కర లేదు. కోవిడ్ వంటి కష్టకాలాల్లో ప్రపంచదేశాలను శక్తికొద్దీ ఆదుకోవడం, అవసరమైన అన్ని రకాల సాయాలు అందించి చిన్నదేశాలకు అండగా ఉండడం, ముఖ్యంగా పసిఫిక్ తీరంలోని ద్వీపదేశాలకు కరోనా నిరోధానికి వ్యాక్సిన్‌లు పంపడం, ఆ దేశాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు నిత్యావసరాలను సైతం సరఫరా చేయడం, ప్రజలకు అవసరమైన వైద్య సౌకర్యాల కోసం భారత్ చేయూతనందిస్తుందని హామీ ఇవ్వడం వంటి మానవీయమైన చర్యలతో ప్రధాని మోడీకి, తద్వారా భారత్‌కు ఆయా దేశాల్లో మరింత గౌరవం ఇనుమడించింది. ఆ దేశాల ప్రజలకు భారత్ నుంచి ఓ మంచి భరోసా లభించినట్లయింది. భారతదేశం శాంతిదేశమని, ప్రపంచమానవాళి శ్రేయస్సును భారత్ కోరుకుంటుందని పదేపదే మోడీ చెప్పుండడం, రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధానికి చరమగీతం పాడడానికి భారత్ చేయగలిగినదంతా చేస్తుందని ఈ సందర్భంగా జీ-7 శిఖరాగ్ర సదస్సులో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో చెప్పడం మోడీ పర్యటనలో ప్రాధాన్యత సంతరించుకుంది. యుద్ధం అనర్ధదాయకమని, దాని పరిణామాలు ప్రపంచమంతా చవిచూస్తోందని మోడీ అంటూ, 'ఇది మానవత్వానికి చెందిన అంశం.. యుద్ధానికి ముగింపు పలకడంలో భారత్ చేయగలిగినదంతా చేస్తుందని' చెప్పడం ఉక్రెయిన్‌నే కాదు, ప్రపంచ ప్రజలందరినీ ఆకట్టుకుంది. ఇలా ఎన్నో ధీరోదాత్త నిర్ణయాలు, ఉత్తేజిత ప్రసంగాలతో, అనేకదేశాల నాయకులతో స్నేహపూర్వక వాతావరణంలో అనేక అంశాలపై చర్చలు జరిపి, అంతర్జాతీయస్థాయిలో భారత్ ఖ్యాతిని చాటుతూ మోడీ చేసిన విదేశీపర్యటన జయప్రదం కావడం విశేషం.




అబ్బా మొత్తానికి మన మోదయ్య అందరూ ఊహించిందే చేశాడయ్యా..! ఎప్పుడో ఒకరోజు రెండువేల కాయితాన్ని మోడీ మాయం చేస్తా డనుకున్న జనాల ఆలోచనని ఆయన నిజం చేశాడు. మార్కెట్లో రెండు వేలు దొరకడం లేదు, ప్రింటింగు ఆపేశారు, తొందరలో రద్దు చేస్తారు... అని చాలా రోజులనుండి టీ బంకుల కాడ కూడా మాట్లాడుకుంటున్నారు. ఇప్పుడు అదే జరిగింది. రద్దు కాలేదు కానీ, మనకాడ ఉండేవన్నీ రిజర్వు బ్యాంకు ఎనక్కి ఇచ్చేయమంటోంది. అంటే రెండువేల కాగితం ఇంక మేము ముద్రించడంలేదు, కాబట్టి మీ కాడ ఉండేయి కూడా మాకు ఇచ్చేయండి, అక్టోబర్ ఒకటవ తేదీ నుండి అవి చిత్తుకాగితాలే అంటూ రిజర్వు బ్యాంకోళ్ళు చెప్పేశారు. సెప్టెంబర్ 30 దాకా టైం కూడా ఇచ్చారు. ఈ లోపల లాకర్లలో, గుడ్డల కింద, వంటిళ్లలో దాచిపెట్టినవన్నీ బ్యాంకుకి తెచ్చి రోజుకిరవై వేలు మార్చుకోమని చెప్పారు. బ్యాంకులో అకౌంట్ ఉంటే ఎంతైనా కట్టుకోండి అని కూడా అన్నారు. సెప్టెంబర్ 30వతేదీ దాకా 2000 కాయితం బహిరంగ మార్కెట్లో కూడా చెల్లుబాటవుతుంది. చిల్లరంగడి కాడనుండి బంగారంగడి దాకా ఎక్కడైనా రెండువేల కాయితాలు ఇచ్చి మనకి కావలసింది కొనుక్కోవచ్చు కూడా.

విషయం సరిగ్గా అర్థం కాక చాలామంది అయోమయంలో ఉండారు. రెండువేల కాయితాలు ఎత్తుకుని బ్యాంకులకాడకి పరిగెత్తుతుండారు. రెండు వేలనుండి రెండు లచ్చల దాకా ఉండేవారికి ఇబ్బందే లేదు. ఎక్కడైనా మార్చుకోవచ్చు. కోట్ల రూపాయలని అలమారాల్లోనో, అట్టపెట్టెల్లోనో దాసి పెట్టుండేవాళ్ళకే ఇప్పుడు ఇబ్బందంతా.



## రెండు వేల కాయితానికి సెప్టెంబర్ దాకే ఇలువ!

ముఖ్యంగా రాజకీయ నాయకులకే పెద్ద చిక్కొచ్చిపడింది. మొన్న కర్నాటక ఎలక్షన్లు ఐపోగానే రెండువేలకి బీజేపోళ్లు మంగళం పాడేశారు. మళ్ళీ మరోచోట ఎలక్షన్లు వచ్చే లోపల పింకు నోటు చెల్లకుండా కట్టడి చేశాడు మోడీ. ఇలా జరగద్దని ఆయనకి ముందే తెలుసు కాబట్టి ఆ పార్టీ వాళ్లకి సమాచారం చేరే ఉంటుందేమో. ఇప్పుడు వచ్చిన చిక్కల్లా ఇతర రాజకీయ పార్టీ వాళ్లకి, వాళ్ళు పెట్టుబడిదారులకే.

మొన్న 23వ తేదీ మంగళవారం నుండి పది రెండువేల కాగితాలు (20,000) బ్యాంకులో ఇచ్చి బదులుగా వేరేవి తీసుకోమని చెప్పారు. అయితే సామాన్య జనాల్లో నుండి పెద్దగా స్పందన రాలేదని ఒక బ్యాంకాయన నాతో చెప్పాడు. దిగువ, మధ్యతరగతి కుటుంబాల వారి దగ్గర ఈ కాగితాలు పెద్దగా ఉండవని, ఉండేదంతా బడాబాబులదగ్గరేనన్నది ఆయన అభిప్రాయం. రద్దుకి, ఉపసంహరణకి చాలా తేడా ఉంది. రద్దు అంటే ఇక ఆ క్షణం నుండి అది చెల్లదు. ఉపసంహరణ అంటే వాడుక నుండి తీసేస్తున్నాం అని అర్థం. సెప్టెంబర్ 30 వరకు అంటే దాదాపుగా నాలుగు నెలలకి పైగా రెండువేల నోటు చెల్లుబాటవుతుంది. వ్యాపారస్తులు ఈ నోటు తీసుకోమని అనడానికి లేదు. ఆలా అంటే అది నేరం. సెప్టెంబర్ 30 వరకు న్యాయపరంగా 2000 నోటు ఎక్కడైనా చెల్లుతుంది. ఒకవేళ రిజర్వు బ్యాంకోళ్ల మనసు మారి చెల్లుబాటు వ్యవధిని మరికొంత కాలం పొడిగిస్తే తప్ప అక్టోబర్ ఒకటవ తేదీ నుండి రెండువేల కాయితం చెత్త కాయితమే.

కోట్ల కొద్దీ నల్లధనాన్ని పింకు కాగితాల్లోకి మార్చి మూటగట్టి పెట్టినోళ్లు భయపడాలి తప్ప సామాన్య జనానికి ఈ రెండువేల ఉపసంహరణతో పెద్దగా వచ్చే సమస్యలేమీ ఉండవు. అబ్బయ్యా ఇదీ మందల ...!

# ఇసుక, మట్టి తరలిపోతూనే ఉంది

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

జిల్లాలో ఇసుక, మట్టి, తెల్లరాయి తదితరాలన్నీ తరలిపోతూనే ఉన్నాయి. ఎక్కడ చూసినా అక్రమార్కులదే రాజ్యమైపోయింది. ముఖ్యంగా పెన్నానది పరీవాహక ప్రాంతాల్లో బంగారంలాంటి ఇసుకను నిత్యం తరలించుకుపోతూనే ఉన్నారు. ప్రభుత్వం నుంచి ఉండే అనుమతి కొంతైతే, తీసుకువెళ్ళేది బోలెడంతగా ఉంటోంది. అక్రమ రవాణాకు అలవాటుపడిపోయి, అక్రమార్జనలే ధ్యేయంగా బతికేవారికి ఇసుక, మట్టి పెట్టుబడి లేని వ్యాపారంగా మారిపోయింది. ఇసుక తవ్వుకున్నోడిక తవ్వుకున్నంత, దోచుకునే వాడికి దోచుకున్నంత... అన్నట్లుగా తయారైంది పరిస్థితి. అధికారులు రాత్రి, పగలు కాపలాకాస్తూ.. అక్రమ రవాణాను అరికడుతూనే ఉన్నా, ఏమారితే చాలు లారీలు, ట్రాక్టర్లు రయ్‌మంటూ వెళ్లిపోతూనే ఉన్నాయి. పర్యావరణాన్ని కాపాడుకోవాలని, ప్రకృతి వనరులను పరిరక్షించుకోవాలని నాయకులు చెప్పే మాటలన్నీ నీటిమూటలుగానే మిగులుతున్నాయి. కొన్నిచోట్ల కొంతమంది సిబ్బంది కూడా అక్రమార్కులకు వంత పాడుతూ ఈ వ్యవహారాన్ని చూసీ చూడనట్లుగా ఉంటున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈ దోపిడీని అరికట్టేందుకు ఉన్నతాధికారులైనా ప్రయత్నం చేయాలి. లేకుంటే అక్రమార్కుల దెబ్బకు జిల్లాలో చివరికి మట్టీమశానం కూడా మిగలదు.

**కె.సూర్యనారాయణ, కొత్తూరు.**

# జొన్నవాడ రోడ్డు బాగయ్యేదెప్పుడు?

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, మహిమాన్వితమైన శ్రీ జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి దేవాలయం. నిత్యం వందల సంఖ్యలో జొన్నవాడకు వచ్చి శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని దర్శించుకుంటుంటారు. ఇక ఉత్సవాలు, ప్రత్యేక వేడుకల రోజుల్లోనైతే భక్తుల సంఖ్య వేలల్లోనే ఉంటుంది. వచ్చే పోయే వాహనాలతో జొన్నవాడ రోడ్డు రామందాడిగా ఉంటుంది. అయితే, ఎన్నో రోజుల నుంచి బుచ్చిరెడ్డిపాళెం జొన్నవాడ ఆర్అండ్‌బి రోడ్డు బాగా దెబ్బతినిపోయి ఉండడంతో, రాకపోకలకు బాగా ఇబ్బందిగా ఉంటోంది. ఈ రోడ్డున వెళ్లే వేలాది వాహనాల వారికి ఇదెంతో ప్రమాదకరంగా తయారై ఉంది. రోడ్డంతా ఎగుడుదిగుళ్లు, గుంటలు మిట్టలుగా ఉంది. పగలు రాత్రి వాహనాలు అధికసంఖ్యలో ఈ రోడ్డుపై వెళ్తుంటాయి. ప్రజలు, భక్తులు పెద్దసంఖ్యలో ఈ వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. అయినా ఈ రోడ్డు బాగును పాలకులు కానీ, అధికారులు కానీ పట్టించుకోకపోవడం విచారకరం. ముఖ్యంగా పెనుబల్లి గ్రామం నుంచి జొన్నవాడ వరకు రోడ్డు గుంటలు పడి, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయపడుతున్నారు. జిల్లా అధికారులు అనేకమంది ఈ రోడ్డుపై వాహనాల్లో వెళ్తుంటారు కానీ, రోడ్డు బాగు గురించి ఆలోచించడం లేదు. జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులైనా ఈ రోడ్డు దుస్థితిని గమనించి, దానిని వెంటనే బాగుచేయించాలని కోరుకుంటున్నా.

**- జె.మల్లికార్జునయ్య, నెల్లూరు.**

# కరెంటు కోతలతో ఇక్కట్లు

ఎండలు మునుపెన్నడూ లేనంతగా మండిపోతున్నాయి. దానికి తోడు ఉక్కపోత ఒకటి. సెగకు మలమల మాడిపోయేటట్లుంది పరిస్థితి. ఈ బాధలు చాలవన్నట్లు కరెంటు కోతలు మరీ దారుణంగా ఉంటున్నాయి. ప్రభుత్వం కోతలు లేని నాణ్యమైన విద్యుత్ అంటూ ప్రచారార్భాటాలు చేసుకుంటున్నా, అవి ఆచరణకు నోచుకోవడం లేదు. ఒక్క జిల్లాలోనే కాదు, ఆంధ్రా అంతటా ఇదే పరిస్థితి. పల్లెల్లోనే కాదు నగరాల్లో సైతం ఎప్పుడు కరెంటు పోతుందో తెలియడం లేదు. ఒకప్పుడు కరెంటు కోతలంటే... ముందుగా ఈ సమయం నుండి ఈ సమయం దాకా కరెంటు కోత అంటూ పేపర్లలో సమాచారమిచ్చేవారు. ఇప్పుడు అదేమీ లేదు. ఎప్పుడు పడితే అప్పుడు కరెంటు పోతా ఉంది. వస్తూ ఉంది. కరెంటు బిల్లులు మాత్రం వాయగొడుతున్నారు. ఆ బిల్లులకు దగ్గ నాణ్యమైన, కోతలు లేని కరెంటును మాత్రం ప్రజలకు అందించలేకపోతున్నారు. ఈ ఎండలకు అక్కడక్కగా ట్రాన్స్‌ఫార్మర్లు పేలుతున్నా, వాటి పునరుద్ధరణకు అలక్ష్యం వహిస్తున్నారు. రాత్రి సమయాలలో కూడా కరెంటు కోతలు ఉంటున్నాయి. ఎప్పుడైనా రాత్రిళ్ళు కరెంటు పోతే... ఇక మా పరిస్థితి అంతే. మంచి నిద్రలో ఉన్న పిల్లలు మెళకువ తెచ్చుకుని ఏడుపు మొదలుపెట్టేస్తున్నారు. వారిని సముదాయించే సరికి మా తల ప్రాణం తోకకు వచ్చేస్తోంది. ఈ కోతలకు సంబంధించి లైన్‌మెన్‌లను ప్రశ్నించినా సమాధానం రాదు. సర్వీస్ చేస్తున్నామని, చెట్లు కొడుతున్నామని ఏదో ఒక సమాధానంతో సరిపెడుతున్నారు. ప్రభుత్వం కూడా దీనిపై దృష్టిపెట్టాలి. కరెంటు ఛార్జీలు పెంచినపుడు దానికి తగ్గట్లుగా విద్యుత్ అధికారుల సేవలుండాలి. అలా చేయలేనప్పుడు 'కోతలు లేని నాణ్యమైన విద్యుత్' అంటూ పత్రికలలో ప్రగల్భాలు పలకడం ఎందుకు? ఈ సమయం నుండి ఈ సమయం వరకు కోత ఉంటుంది అని బహిరంగంగానే చెప్పొచ్చుగా.

**జె. యస్. కృష్ణ, నెల్లూరు.**



## పర్యావరణ పరిరక్షణకు
# అదాని కృష్ణపట్నం పోర్టు కృషి

పర్యావరణ పరిరక్షణ కోసం అదాని కృష్ణపట్నం పోర్టు కృషిచేస్తుందని జిల్లా పర్యావరణ శాఖ ఇంజనీర్ రాజశేఖర్ తెలిపారు. ఇటీవల ఆయన కృష్ణపట్నం పోర్టు ఉద్యోగులు, కార్మికులచే కృష్ణపట్నం సముద్రతీరంలో చేపట్టిన వ్యర్థాల తొలగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా పర్యావరణ శాఖ, అటవీ శాఖ, అదాని కృష్ణపట్నం పోర్టు సహకారంతో బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని 500 మందితో నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ సాగర్-సురక్ష సాగర్ నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. అదాని కృష్ణపట్నం పోర్టు ఉద్యోగులు కార్మికులు పర్యావరణ పరిరక్షణ కోసం కృషిచేస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అటవీ శాఖ సెక్షన్ అధికారి జీవిఆర్ ప్రసాద్, సుధ, పోర్ట్ డ్రై కార్గో హెడ్ మనిష్ దావే, పోర్టు సెక్యూరిటీ హెడ్ వెంకటేష్ భాస్కరన్, అడ్మిన్ ఏజీఎం గంగా సతీష్, పోర్ట్ ఎన్విరాన్మెంట్ ఏజీఎం విజయ్ ఫైనాన్స్ హెడ్ గుడివాడ శ్రీకాంత్, హెచ్ఆర్ డీజీఎం సిహెచ్ శ్రీనివాస్, ఈహెచ్ఎస్ ఏజీఎం వేణుగోపాల్‌రెడ్డి, మనోహర్ బాబు, రామానంద్ యాదవ్,అపర్ణ, కనకలక్ష్మి, పద్మావతి, పుచ్చలపల్లి శ్రీనివాసులు, రాజేష్‌యాదవ్‌లతో పాటు, వివిధ విభాగాల అధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# జిల్లాలో 11359 మంది వలంటీర్లకు పురస్కారాలు



ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా వుంటూ, ప్రతి గడపకూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను సకాలంలో చేరవేస్తున్న వలంటీర్లను ప్రతి ఒక్కరూ అభినందించాలని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ అన్నారు. 'వలంటీర్లకు వందనం' కార్యక్రమాన్ని విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల ప్రారంభించగా, నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి వర్చువల్‌గా జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ హరినారాయణన్, కమిషనర్ వికాస్‌మర్మత్, ఎస్పీ హిమవతి, డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డి పాల్గొని వలంటీర్లను శాలువా, మెడల్స్‌తో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 2.65 లక్షల మంది వలంటీర్ల సేవలను గుర్తించి సత్కరించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని, జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాల స్థాయిలో వలంటీర్లను సత్కరిస్తామన్నారు. సాంబశివారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 11359 వలంటీర్లు సేవా వజ్ర, సేవా రత్న, సేవామిత్ర నగదు పురస్కారాలకు ఎంపికయ్యారని, వీరిలో 44 మంది వలంటీర్లకు సేవా వజ్ర పురస్కారాల ద్వారా ఒక్కొక్కరికి రూ 30 వేలు, 235 మంది వలంటీర్లకు సేవా రత్న పురస్కారాల ద్వారా ఒక్కొక్కరికి రూ. 20 వేలు, 11080 మంది వాలంటీర్లకు సేవామిత్ర పురస్కారాలు ద్వారా ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున నగదు పురస్కారాలను ముఖ్యమంత్రి విజయవాడ నుంచి బటన్ నొక్కి జమ చేశారన్నారు. వలంటీర్లు అందరూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను చేరవేయడంలో ఉత్సాహంతో పనిచేసి మెరుగైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. డీఎల్‌డివో కనకదుర్గాభవాని, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్, నెల్లూరు నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ చెన్నుడు, వలంటీర్లు పాల్గొన్నారు.

# పుష్ప, పత్రాలతో..హనుమకు అలంకారం



ముత్తుకూరులోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 22న స్వామివారిని ఆలయ అర్చకులు పుష్పాలు, వివిధ పత్రాలతో అలంకరించి వేడుక చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు. సోమా హనుమంతరావు, సోమా శ్రీనివాసరావులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

# పుస్తకపఠనంపై పోటీలు

నెల్లూరులోని జిల్లా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఈనెల 23న విద్యార్థులకు పుస్తకపఠనంపై ఆసక్తి కలిగిస్తూ పోటీలు నిర్వహించారు. పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజా సైన్స్ వేదిక పట్టణ అధ్యక్షుడు సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల అనంతరం, విజేతలకు బహుమతులు అందజేశారు.

# అందరూ సమన్వయంతో పనిచేయాలి

## - జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అన్ని రంగాల్లో మొదటి స్థానంలో నిలిపేందుకు కృషిచేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. ఈనెల 20న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ, జిల్లా గృహ నిర్మాణ సంస్థ, జలవనరుల శాఖ మరి వాటి అనుబంధ శాఖలు, రహదారులు మరియు భవనాల శాఖ, విద్యుత్ శాఖ, జిల్లా వ్యవసాయ శాఖ తదితర శాఖలకు సంబంధించి అజెండాలోని అంశాలను చర్చించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిరుపేద బడుగు బలహీన వర్గాలకు చేరేలా కృషి చేస్తూ జిల్లాను ప్రగతి బాటలో ముందంజలో నిలిపేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. జగనన్న కాలనీల్లో పేదలకు నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాల పురోగతిలో జిల్లా మొదటి స్థానంలో ఉండటం అభినందనీయమన్నారు. రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర చరిత్రలో ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చేలా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ఇళ్ల స్థలాలతో పాటు ఇల్లు నిర్మించి అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు. జిల్లాలోని అన్ని మండలాలను నుడా పరిధిలోకి చేరుస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాల్సిందిగా మార్క్‌ఫెడ్ వారిని ఆదేశించడం జరిగిందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం శాసనమండలి సభ్యులుగా ఇటీవల ఎన్నికైన మేరిగ మురళీధర్‌ను, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలను మంత్రి కాకాణి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సన్మానించారు. తొలుత రాపూరు ఎంపిపి సభ్యులు, ఇటీవల మృతి చెందిన చెన్ను బాలకృష్ణారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ రెండు నిమిషాల పాటు అందరూ మౌనం పాటించారు. జిల్లా కలెక్టర్ హరినారాయణన్, శాసన మండలిసభ్యులు మేరుగ మురళీధర్, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, గూడూరు శాసనసభ్యులు వరప్రసాద్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ సిఇఓ చిరంజీవి, ఆప్కాబ్ ఛైర్మన్ అనీల్‌బాబు, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వలంటీర్లను సత్కరించిన రామ్‌కుమార్‌రెడ్డి



కలువాయి మండలంలోని ఉమామహేశ్వర కళ్యాణ మండపంలో ఈనెల 23న వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఛైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పలువురు వలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కలువాయి మండల నాయకులు, కార్యకర్తలు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలల సమస్యలపై ఏబిఆర్ఎస్ఎం వినతి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డా. గంగినేని రంగనాథ్‌లు ఇటీవల అమరావతిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె. హేమచంద్రారెడ్డిని మరియు డిగ్రీ కళాశాలల కమిషనరేట్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్‌ను కలిసి రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రైవేటు, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా రాష్ట్రంలో గత రెండు మూడు సంవత్సరాలుగా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు చాలా ఆలస్యంగా జరుగుతున్నాయని, గత సంవత్సరం జూన్‌లో జరగాల్సిన ప్రవేశాలు నవంబర్లో జరగడంతో, చాలా మంది విద్యార్థులు రాష్ట్రంలో డిగ్రీలో రెగ్యులర్ ప్రవేశాలు పొందలేక ఆన్‌లైన్‌లో డిస్టెన్స్ లేదా ప్రైవేట్ మోడ్లో అడ్మిషన్లు పొందడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రస్తుతం డిగ్రీ కళాశాలల్లో సెమిస్టర్ సిస్టం ఉన్నందువల్ల ప్రతి ఆరు నెలలకి పరీక్షలు జరపవలసిన అవసరం ఉంది, కానీ ప్రవేశాలు ఆలస్యం అయినందువల్ల సెమిస్టర్‌లు తొందరగా ముగించి పరీక్షలు పెడుతున్నందువల్ల విద్యార్థుల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని వివరించారు. రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు జూన్‌లోపు పూర్తిచేయాలని ఆ వినతిపత్రంలో కోరారు. ప్రతి సంవత్సరం డిగ్రీ కళాశాలలో ప్రవేశాల తరువాత మాత్రమే ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాలు జరుగుతున్నాయి. కానీ గత రెండు మూడు సంవత్సరాలుగా ఇంజనీరింగ్ కళాశాలలో మూడు దఫాలు ప్రవేశాలు అయిన తర్వాత డిగ్రీ ప్రవేశాలు జరుపుతున్నారని, దీనివలన డిగ్రీలో చేరవలసిన విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కనుక ఇకనైనా వెంటనే తగు చర్యలు చేపట్టి జూన్ 30వ తేది లోపు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు పూర్తిచేయాలని వారు కోరారు. ఇప్పటికే రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ మరియు ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు లేక, కళాశాలలు మూతపడే పరిస్థితిలో ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ప్రవేశాలు వెంటనే చేపట్టవలసిన అవసరం ఉందని తెలిపారు. అదేవిధంగా, నూతన విద్యా విధానంలో భాగంగా రాబోయే విద్యా సంవత్సరంలో సింగిల్ మేజర్ సబ్జెక్టును ప్రవేశపెట్టినందువల్ల అనేకమంది నూతన అధ్యాపకుల అవసరం ఉంటుందని, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న దాదాపు రెండు వేల అధ్యాపకుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

# ముగ్గురు విద్యార్థులకు రాష్ట్రస్థాయి పురస్కారాలు

జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాల్లో చదువుకుంటూ ఇటీవల 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పురస్కారాలకు ఎంపికైనట్లు జిల్లా బీసీ సంక్షేమాధికారి వై.వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్లలో మొదటి 10 ర్యాంకులు సాధించిన 10మంది విద్యార్థులకు ఈనెల 24న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రప్రభుత్వం తరపున సన్మానించడం జరుగుతుందని, అందులో భాగంగా నెల్లూరుజిల్లాలోని అన్నారెడ్డిపాళెం బీసీ హాస్టల్ విద్యార్థి, రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించిన బి.కోటిభార్గవ్ (583 మార్కులు), అదేవిధంగా, సౌత్‌మోపూరు విద్యార్థి, రాష్ట్రంలో 7వ ర్యాంకు సాధించిన (577 మార్కులు) ఫణీశ్వర్, అనంతసాగరం విద్యార్థి, రాష్ట్రంలో 9వ ర్యాంకు సాధించిన (575 మార్కులు) ఎస్‌కె నాయబ్‌లు ఈ పురస్కారాలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ పురస్కారాలకు ఎంపికైన విద్యార్థులు, వారి తల్లితండ్రులు, ఆయా హాస్టళ్ల వార్డెన్లు కూడా హాజరు కావాలని ఆయన సూచించారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

## - నెల్లూరు ఎంపీ ఆదాల



అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు కృషిచేస్తున్నామని, ప్రత్యేకించి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో ప్రజలకు మౌలిక వసతులను కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 23న ఆయన నెల్లూరు రూరల్‌లోని 18వ డివిజన్ ఆనం వెంకటరెడ్డినగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్లను ప్రజలకు అందజేసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సిందిగా ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మర్రిపాడు జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, రైల్వేబోర్డు సభ్యుడు వెంకయ్య, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ అశోక్, నాయకులు హరిబాబుయాదవ్, వంశీ, శివసునీల్ తదితరులు పాల్గొన్నారు.

# మహానాడుకు తరలిరండి

మే 27, 28 తేదీల్లో రాజమహేంద్రవరంలోని వేమగిరిలో జరుగనున్న మహానాడుకు టిడిపి శ్రేణులు తరలిరావాలని నెల్లూరులోని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లాలోని టిడిపి కార్యకర్తలు, నాయకులు అందరూ పాల్గొని మహానాడును జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఓపెన్‌స్కూల్ ఫలితాలు వచ్చేశాయ్

సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్‌స్కూల్) పదో తరగతి, ఇంటర్‌మీడియట్ ఫలితాలు వచ్చాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్‌ఎస్ గంగాభవాని ఈనెల 23న ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పదో తరగతి విద్యార్థులు 1139 మంది పరీక్షలు రాయగా, 902 మంది, ఇంటర్ విద్యార్థులు 2975 మందికి గాను 2461 మంది ఉత్తీర్ణులయ్యారని ఆమె పేర్కొన్నారు.

## నెల్లూరు కబుర్లు




# వ్యవసాయశాఖ ఏడీలు, ఏఓలకు శిక్షణ

ఎరువుల, విత్తనాలు, పురుగుమందుల నాణ్యతకు సంబంధించి వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు, వ్యవసాయ అధికారులకు ఈనెల 23న నెల్లూరులోని వ్యవసాయ పరిశోధన స్థానంలో శిక్షణ నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ కమిషనరేట్ ఉన్నతాధికారులు డా.కృపాదాస్, డా.జి.వెంకటేశ్వరరావులు పాల్గొని పలు అంశాలను అధికారులకు వివరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు డా.కెజెడి రాజన్, డా.కెవెల్ సుదర్శనరాజు, డా.మద్దులేటి పాల్గొని విత్తన చట్టం, పురుగుమందుల నియంత్రణ చట్టం తదితరాలను విశదీకరించారు. జిల్లా వ్యవసాయశాఖ జేడీ సుధాకర్‌రాజు, ప్రకాశం జిల్లా జేడీ డా.ఎస్.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయ సంచాలకులు డా.ఏ. నర్సోజీరావు, వ్యవసాయశాఖాధికారులు డా.సిహెచ్ శ్రీనివాసులు, డా.చల్లా మంజుల, శివనాయక్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మెన్‌గా.. దామిశెట్టి



నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ కార్యాలయంలో ఈనెల 21న రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మెన్‌గా దామిశెట్టి సుధీర్‌నాయుడును మేనేజింగ్ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఈ సందర్భంగా దామిశెట్టిని అభినందించారు.

# 20వ డివిజన్‌లో సిసిరోడ్డుకు ప్యాచ్‌వర్క్‌లు

## ● ఆర్‌ఎస్‌ఆర్‌చే ప్రారంభం



నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతో, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సూచనలు మేరకు 20వ డివిజన్ సీనియర్ నాయకులు, నెల్లూరు గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవాలయం ఛైర్మెన్ రావు శ్రీనివాసరావు (ఆర్‌ఎస్‌ఆర్) ఆధ్వర్యంలో 20వ డివిజన్‌లో ఉన్న సిసి రోడ్లు ప్యాచ్‌వర్క్‌లు ఇటీవల ప్రారంభించారు. ఆ డివిజన్ పరిధిలోని వనంతోపు 3వ వీధి నవ్యా ప్రైడ్ అపార్ట్‌మెంట్ ముందు ఉన్న సిసి రోడ్డు పెద్ద గుంట దగ్గర నుండి డివిజన్‌లోని అన్ని ప్యాచ్‌వర్క్‌లను చేపట్టడంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు తాళ్లూరి సురేష్ బాబు, గొడుసు సరళమ్మ, పోతురాజు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం



మాజీ ప్రధాని, దివంగత కాంగ్రెస్ నేత రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మరియు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఆస్తుల పరిరక్షణ కమిటీ ఛైర్మెన్ చేవూరు దేవకుమార్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ఇందిరాభవన్‌లో ఇటీవల రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చేవూరు మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీదేనని, దేశంలో ఐటి రంగాన్ని తీసుకువచ్చిన ఘనత కూడా ఆయనదేనని కొనియాడారు. 2024లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని, రాహుల్ ప్రధాని అయితేనే మనదేశం ప్రగతి పథంలో రాణించగలదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అందరూ కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సి.వి శేషారెడ్డి, పిసిసి సభ్యులు తలారి బాలసుధాకర్, నాయకులు గంధం యుగంధర్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

# 'తంగిరాల మహాభారతం' 56వ భాగం




అర్జునుడు సౌభద్ర తీరంలో ఒక పుణ్యక్షేత్రంలో స్నానమాచరిస్తుండగా ఒక మొసలి కాళ్ళను పట్టినప్పుడు, అర్జునుడు దాన్ని తీరంపైకి విసిరివేస్తాడు. అప్పుడా మొసలి ఒక దేవకన్యగా మారిపోయి ఒక మునీశ్వరుడిచ్చిన శాపం వలన తాను, మరో నలుగురు ఇలా మొసళ్లలాగ 100 ఏళ్ళనుంచి ఈ 5 తీర్థనదుల్లో ఉన్నామని మిగతా వారికి కూడా శాప విముక్తి చెయ్యమన్నప్పుడు అర్జునుడు వారిని విడిపిస్తాడు.

అర్జునుడు తన తీర్థయాత్ర కొనసాగిస్తూ, మునీశ్వరుని రూపంలో ద్వారకా నగరం దగ్గరకు వచ్చినప్పుడు శ్రీకృష్ణుడు వచ్చి కలుసుకుని, అర్జునుడికి సుభద్ర అంటే ఇష్టమని గ్రహించి, అర్జునుణ్ణి ద్వారకకు దగ్గరలో వున్న రైవతక పర్వత గుహలోకి తీసుకువస్తాడు. మరునాడు శ్రీకృష్ణుడు ఆ రైవతక మహోత్సవమని చాటింపు వేయించి, భార్యలతో అక్కడికి వస్తాడు.

బలరాముడు, అర్జునుడు గొప్ప మునీంద్రుడని తలచి, చాతుర్మాస వ్రతాన్ని ఆచరించమని, సుభద్రని ఆయనకు పరిచర్యలు చేయమని వినియోగిస్తాడు. సుభద్ర ఎంతో భక్తిశ్రద్ధలతో సపర్యలు చేస్తుంది. ఒకనాడు సుభద్ర అర్జునిడితో పాండవుల గురించి, అర్జునుడి గురించి అడిగినప్పుడు, అర్జునుడు నిజం చెప్పేస్తాడు తానెవరినని. సుభద్ర ఎంతో సంతోషిస్తుంది. అర్జునుడు మనం గాంధర్వ వివాహం చేసుకుందామని అడిగినప్పుడు, కన్య ప్రదానంలో పెద్దలే వివాహం జరిపించగలరని చెపుతుంది.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam
@YouTubeలో చూడగలరు.








# విద్యార్థులకు వర్క్‌బుక్స్

నెల్లూరులోని కొండాయపాళెంలో ఉన్న నగర పాలక ప్రాథమిక పాఠశాలలో ఇటీవల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం.భాస్కర్‌రావు ప్రభుత్వం పంపిణీ చేసిన 3,4 మరియు 5వ తరగతుల విద్యార్థులకు ఈ సందర్భంగా సమ్మర్ వర్క్ బుక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు ఈ వర్క్‌బుక్స్‌ను పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్ మరియు వాలంటీర్లు వినీత, రాశి తదితరులు పాల్గొన్నారు.

# 28న యానాదుల సమావేశం

యానాదుల సమస్యలపై ఈనెల 28న నెల్లూరులోని డా.జెట్టి శేషారెడ్డి భవన్‌లోని మినీ ఫంక్షన్‌హాల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరుగుతుందని ఏపీ గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసీ పెంచలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. యానాది ప్రజాప్రతినిధులు, మేధావులు, ఉద్యోగులు, కులప్రముఖులతో జరిగే ఈ సమావేశంలో తమ సంఘం రాష్ట్ర నాయకులు కృష్ణయ్య, ఉష, వరలక్ష్మి, భాగ్యలక్ష్మి, శ్రీనివాసరావు, శీను తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

# రైతుల డబ్బు చెల్లించాలి

## - కోటిరెడ్డి వినతి

ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి 2020-21లో మొదటి పంటలో రైతులకు రవాణా ఛార్జీలు, హమాలీ కూలీలకు ఇవ్వాల్సిన డబ్బును చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపి రైతుసంఘాల సమాఖ్య నాయకుడు చిరసాని కోటిరెడ్డి జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌కు ఈనెల 23న వినతిపత్రం అందజేశారు.


## ఏపి రచయితల సంఘం

# ఉపాధ్యక్షునిగా జయప్రకాష్

గుంటూరు అన్నమయ్య గ్రంథాలయంలో ఈనెల 21న ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సోంపల్లి వెంకటసుబ్బయ్య అధ్యక్షుడిగా, చలపాక ప్రకాష్ ప్రధానకార్యదర్శిగా, నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. గతంలో కూడా జయప్రకాష్ ఆ సంఘానికి ఉపాధ్యక్షుడిగా ఉన్నారు.

# కోవిడ్ వ్యాప్తికి చెక్ పెట్టిన..

# మన నెల్లూరీయుడు ఎంఎస్ రెడ్డి



## ○ కొత్త పరిశోధనకు అమెరికాలో పేటెంట్ మంజూరు

***భవిష్యత్తులో కోవిడ్ మహమ్మారిని నిలువరించడానికి అవసరమైన పద్ధతిని కనిపెట్టి నెల్లూరు జిల్లాకు చెందిన డాక్టర్ మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి (డా.ఎం.ఎస్. రెడ్డి), తన పరిశోధనల పరంపరంలో మరో కొత్త ఆవిష్కారాన్ని చేశారు. వైద్య శాస్త్ర రంగంలోనే ఇదొక చరిత్రాత్మక పరిశోధన అని నిపుణులు అంటున్నారు.***

వైరల్ ఆర్ఎన్ఏను ఇన్‌యాక్టివ్ చేయడం ద్వారా కోవిడ్ వైరస్ వ్యాప్తిని ఆపేయవచ్చని ఆయన చెబుతున్నారు. భవిష్యత్తులో కరోనా వంటి ప్రాణాంతక వైరస్‌లు ఎక్కువ వ్యాప్తి చెందక ముందే నిలువరించే అవకాశం కూడా ఉంటుందని ఆయన పేర్కొంటున్నారు. ఈ విధానంపై ఎంఎస్ రెడ్డి యూఎస్ పేటెంట్ శాఖలో రిజిస్టర్ చేసుకున్నారు. ఆయన పేరిట ఈ పేటెంట్‌ను ఇటీవలే అమెరికా ప్రభుత్వం విడుదల చేయడం ఆయన ప్రతిభాపాటవాలకి నిదర్శనం. ఈ విధానం ద్వారా ఆర్ఎన్ఏ, డీఎన్ఏలను ఇనాక్టివ్ చేయడం ద్వారా వైరస్ వ్యాప్తిని సులభంగా అదుపు చేయవచ్చని తెలుస్తోంది. ఇంతకుముందు వరకు శాస్త్రవేత్తలు పూర్తి వైరస్ కన్నా నేక్డ్ జెనెటిక్ మెటీరియల్ మరింత ప్రమాదకరం అనే ఆలోచన చేయలేదు. ఈ ఆలోచన చేసిన ఎంఎస్ రెడ్డి, దానికి విరుగుడు కూడా కనుక్కోవడంపై వైద్యరంగ నిపుణులు ఆయన్ను అభినందిస్తున్నారు.

### ఇప్పటికే ఎన్నో పేటెంట్లు :

డాక్టర్ మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి (డా.ఎం.ఎస్.రెడ్డి) అమెరికాలో శాస్త్రవేత్తగా స్థిరపడి ఎన్నో పరిశోధనలు చేసి పెద్ద సంఖ్యలో పేటెంట్‌లను పొందిన వ్యక్తిగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. తిరుపతిలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉన్నతవిద్య పూర్తి చేసిన తరువాత, అమెరికాలోని అయోవా యూనివర్సిటీ నుంచి ఎంఎస్, పిహెచ్‌డి పట్టా అందుకున్నారు. ఫుడ్ టెక్నాలజీ, బాక్టీరియాలజీ మరియు వైరాలజీలో ఉన్నత చదువులు చదివిన తరువాత, ప్రస్తుతం అమెరికన్ డ్కెరీ అండ్ ఫుడ్ కన్సల్టింగ్ లేబొరేటరీస్ మరియు ఇంటర్నేషనల్ మీడియా అండ్ కల్చర్స్‌కు ఛైర్మెన్‌గా, అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఆయన చేసిన పరిశోధనలకు ఎన్నో అవార్డులు లభించాయి. మైక్రోబయాలజీ రంగంలో ఎం.ఎస్.రెడ్డి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందారు. ప్రపంచవ్యాప్తంగా 160 జాతీయ మరియు అంతర్జాతీయ అవార్డులు మరియు గౌరవాలను అందుకున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన అమెరికన్ డ్కెరీ సైన్స్ అసోసియేషన్ రిచర్డ్ ఎం. హెూయ్ట్ స్మారక పురస్కారం కూడా ఆయనకు లభించింది. ఆ జాతీయ అవార్డును అందుకున్న ఏకైక విదేశీ యు.ఎస్.పౌరుడు ఆయనే కావడం విశేషం.

### పరిశోధనల్లో దిట్ట :

ఎంఎస్ రెడ్డి పరిశోధనల్లో దిట్ట. అమెరికాలో ఆయన చేసిన వివిధ పరిశోధనలకు అనేక పేటెంట్లను అందుకున్నారు. వెన్న పులియకుండా ఉండేలా చేసిన పరిశోధన ఆయనకు మంచి గుర్తింపును తీసుకువచ్చింది. 'ఛీజ్ రెడ్డి'గా కూడా ఆయన పేరు తెచ్చుకున్నారు. దాదాపు 150కిపైగా అమెరికా పేటెంట్లు, 140కిపైగా సైంటిఫిక్ జర్నల్స్‌లో కథనాలు, 30కిపైగా ఇ-జర్నల్స్‌లో వివిధ అంశాలపై ఆయన రాసిన పుస్తకాలు ప్రచురితమై ఆయనకెంతో ప్రఖ్యాతిని తెచ్చిపెట్టాయి. అంతేకాదు, వివిధ సంస్థలకు ఛైర్మెన్‌గా, అడ్వయిజర్‌గా కూడా ఆయన పని చేస్తున్నారు.

అమెరికాలో జాతీయ తెలుగు సంఘంగా పేరు పొందిన 'నాటా' ఆయన సేవలకు గుర్తింపుగా జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించి గౌరవించింది. ప్రపంచ స్థాయిలో సైన్స్‌లో ఆయన చేసిన కృషికి నోబెల్ బహుమతికి కూడా నామినేట్ అయ్యారు. కోవిడ్ మహమ్మారి సమయంలో, కోవిడ్ 19ని నియంత్రించే మార్గాలు, ఇతర విషయాలపై ప్రజలకు అవగాహనను కలిగించేందుకు ఆయన అనేక టెలివిజన్ ఛానళ్ళలో ప్రసంగాలు చేశారు. వెబ్‌నార్‌లు, ప్రసంగాలు, యూట్యూబ్‌లో 10 మిలియన్లకు పైగా హిట్‌లతో వైరల్‌గా మారాయి. తాజాగా ఆయన కోవిడ్ వ్యాప్తి కాకుండా ఉండేందుకు పరిశోధన చేసి పేటెంట్‌ను అందుకోవడం విశేషం. డాక్టర్ ఎంఎస్ రెడ్డి నెల్లూరీయుడు కావడం గర్వకారణం.








## సంస్మరణ

మా అభ్యున్నతికి కారకులు, మాకు స్ఫూర్తిప్రదాతలు
బంధుజనప్రియులు, సమతావాది

## పూండ్ల చెంచురెడ్డి గారు

పరమపదించి తేది. 27.05.23 నాటికి
ముప్పైఅయిదు సంవత్సరాలు నిండుతాయి.

**ఆ పుణ్యమూర్తిని సంస్మరించుకొంటూ...**

భార్య :
**లేట్ పూండ్ల కామేశ్వరమ్మ**

కుమారులు :
**డా॥ పూండ్ల శ్రీనివాసులురెడ్డి**
**పూండ్ల వెంకురెడ్డి**
మరియు
**కుటుంబసభ్యులు**

# ఎన్‌బికెఆర్‌లో అమర్ రాజా కంపెనీ ప్రతినిధులు



విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలోని మెకానికల్ విభాగాన్ని ఇటీవల అమర్ రాజా కంపెనీ ప్రతినిధులు సందర్శించారు. అమర్ రాజా గ్రూప్‌లో కొత్తగా ప్రారంభించిన డిజిటల్ విభాగానికి చెందిన స్ట్రాటజిక్ హెడ్ కోన కిషన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ రాంప్రసాద్, అమర్ రాజా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీన్ కె.వి రవికుమార్, సీనియర్ మేనేజర్ సాయిప్రసాద్‌లు మెకానికల్ విభాగంలోని వసతులను, లాబరేటరీలను సందర్శించారు. మెకానికల్ విభాగంతో కుదుర్చుకునే అవగాహన ఒప్పందం మేరకు వీరి సందర్శన జరిగింది. ఈ సందర్భంగా కోన కిషన్ మాట్లాడుతూ మెకానికల్ విభాగంలో అన్ని వసతులు బాగున్నాయని అన్నారు. ఇక్కడ చదువుతున్న రెండవ, మూడవ సంవత్సరం మెకానికల్ విద్యార్థులకు ఇండస్ట్రియల్ స్కిల్స్ మీద శిక్షణ ఇచ్చి తద్వారా నాలుగో సంవత్సరంలో వారికి అమర్‌రాజా గ్రూప్‌లో ఇంటర్న్‌షిప్ చేసేందుకు అవకాశం కల్పిస్తారని, తద్వారా మెకానికల్ విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయని అన్నారు. శిక్షణ పొందినవారిలో కొంతమందికి అమర్‌రాజా గ్రూపులో ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఎన్‌బికెఆర్ కళాశాల సంచాలకులు డాక్టర్ వి.విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మెకానికల్ విభాగంలో రెండు ఇండస్ట్రియల్ రోబోటిక్స్ ల్యాబ్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఉండడం వల్ల ఈ అవకాశం తమ కళాశాల విద్యార్థులకు వచ్చిందన్నారు. మెకానికల్ హెచ్‌ఓడి డాక్టర్ సిహెచ్‌ఆర్ విక్రమ్‌కుమార్ మాట్లాడుతూ, కళాశాలలో చక్కటి సదుపాయాలు కల్పించడానికి ప్రోత్సాహం ఇచ్చిన కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. సీనియర్ ప్రొఫెసర్ ఎం.శ్రీనివాసులు, మెకానిక్ అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ఉపాధ్యాయుల వికాస సదస్సు




కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఐఇటిఇ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ఇసిఇ విభాగం, జెఎన్‌టియుఎ, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో అయిదురోజుల పాటు ఉపాధ్యాయుల వికాస సదస్సును ఈ నెల 22 నుంచి నిర్వహిస్తున్నారు. తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎలక్ట్రిక్ ఇంజనీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా.రామకృష్ణ సాయి గోర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని, సిగ్నల్ ప్రాసెసింగ్, ఇమేజ్ ప్రాసెసింగ్, కంప్యూటర్ విజన్, ఏఐ, ఎంఎల్, డిఎల్ విభాగంలోని పలు సాంకేతిక అంశాలను వివరించారు. ఈ సదస్సు ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడుతుందని కార్యక్రమ సమన్వయకర్త, ఇసిఇ విభాగాధిపతి డా.జి.హరినాధ్‌రెడ్డి అన్నారు. ఈ సదస్సు నిర్వహణకు సహకారం అందించిన జెఎన్‌టియు వైస్ చాన్సలర్ డా.జి.రంగజనార్ధన, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ డా.బి.ఈశ్వరరెడ్డిలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డ మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు మరింత విజ్ఞానాన్ని, సాంకేతిక నిపుణతను అందించడానికి ఈ సదస్సు దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమ సమన్వయకర్తలు ఎస్‌కె మహబూబ్‌బాషా, పి.వల్లీ బాషా తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీ ప్రగతి అద్భుతం




నెల్లూరు జిల్లా ట్రైనీ కలెక్టర్ జి.విద్యాధరి ఈనెల 22న శ్రీసిటీని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆమెకు స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతిని వివరించారు. శ్రీసిటీ ప్రత్యేకతల గురించి చెబుతూ, పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన, స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ మేక్-ఇన్-ఇండియా ప్రచారానికి ధీటుగా వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంలోని భారీ పారిశ్రామిక పార్కుల్లో ఒకటిగా శ్రీసిటీ ఎలా ఎదిగిందో తెలిపారు. శ్రీసిటీ ప్రగతిని ఆమె ఈ సందర్భంగా ప్రశంసించారు.

## శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో 'కోలాటం'



శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో సంప్రదాయ జానపద కళారూపాలను ప్రోత్సహించేందుకు శ్రీసిటీలోని ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక 'శ్రీవాణి' సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20న 'కోలాటం' గ్రామీణ జానపద నృత్య రూపకాన్ని స్థానిక శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి మందిర ప్రాంగణం వద్ద ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా, ఆరూరు గ్రామ కళాకారుల కోలాట ప్రదర్శనను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు, బాలికలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సంప్రదాయ దుస్తులలో నృత్యకారుల ఉత్సాహభరిత ప్రదర్శన అందరినీ ఎంతగానో అలరించింది. కోలాటం ప్రారంభానికి ముందు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, సామూహిక శ్రీవిష్ణు సహస్రనామ పారాయణంలో భక్తులు పాల్గొన్నారు. సామూహిక భగవన్నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కూడా ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. కోలాటం బృందానికి శ్రీసిటీ అకౌంట్స్ విభాగాధిపతి ఆర్.జనార్ధన్‌రెడ్డి నగదు పురస్కారాన్ని అందజేసి వారి ప్రతిభను అభినందించారు. శ్రీసిటీ ప్రతినిధులు మధురెడ్డి, పి.ఎస్.బి.శాస్త్రి, పి.బాలాజీ పర్యవేక్షించారు.

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## ఎమ్మెల్సీ మేరిగకు శుభాకాంక్షల వెల్లువ



గూడూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఈ నెల 23న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. సనత్‌నగర్‌లోని మేరిగ నివాసంలో ఆయన అభిమానులు భారీ కేక్ కట్ చేసి, అన్నదానం, చీరల పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి మేరిగపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఆర్డీవో ఎం.కిరణ్‌కుమార్, డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సాయినాథ్, రూరల్ సి.ఐ జి.దశరథరామారావు, టూటౌన్ సి.ఐ వెంకటేశ్వరరావు, ఎస్సైలు, అనేకమంది వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మేరిగ మురళికి పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ముత్యాలమ్మ అమ్మవారికి పొంగళ్ళు



తూర్పుకనుపూరులోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఈ నెల 23వ తేదీ మూలమూర్తులకు అభిషేకం నిర్వహించారు. భక్తులు పొంగళ్ళు పెట్టుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతులు, పల్లకిసేవ, ఊంజల్ సేవలు నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్, ధర్మకర్తల మండలి, కార్యనిర్వాహణాధికారి పర్యవేక్షణలో పై కార్యక్రమాలను నయనానందకరంగా నిర్వహించారు.



## దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు

గూడూరు టవర్‌క్లాక్ సెంటర్ నుండి రాజావీధి, కుమ్మరివీధి, గాంధీబొమ్మ సెంటర్ వరకు సీసీ కెమెరాల ఏర్పాట్లను గూడూరు డిఎస్‌పి సూర్యనారాయణరెడ్డి ఇటీవల పరిశీలించారు. ఈ సందర్భంగా టవర్‌క్లాక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణంలో దొంగతనాలు నివారణకు అత్యాధునిక పరిజ్ఞానం కలిగిన కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు దుకాణాల యాజమాన్యం, వ్యాపారస్తులను కూడా భాగస్వామ్యం చేస్తున్నామని, వన్‌టౌన్, టూటౌన్, గూడూరు రూరల్‌కి సంబంధించి రిమోట్ కంట్రోల్‌రూమ్‌ను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. గూడూరు రూరల్ సి.ఐ జి.దశరథరామారావు, ఎస్సైలు సుబ్రహ్మణ్యంరాజు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## రోగులకు ప్రగతి సేవా జ్యూస్ ప్యాకెట్లు



వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు, వారి సహాయకులకు ప్రగతి సేవా సంస్థ రాగి జావ, బిస్కెట్ ప్యాకెట్లు, జ్యూస్ ప్యాకెట్లు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సంపూర్ణ సహకారాలు అందించిన జి.చంద్రశేఖరరావుకు ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ మధు, డాక్టర్ రాజేష్‌కుమార్, సంస్థ కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## యాదవ విద్యార్థులకు ప్రోత్సాహకాలు



10వ తరగతిలో 500, ఆపైన మార్పులు సాధించిన జిల్లాలోని యాదవ విద్యార్థులకు యాదవ ఎంప్లాయిస్ & ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందించనున్నామని ఆ సంస్థ గౌరవ సలహాదారు డాక్టర్ మయూరి శ్యామ్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. యాదవ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, 500 మార్కులు ఆ పైన సాధించిన విద్యార్థులు 9948606664 నెంబర్‌కు ఫోన్ చేసి లేదా వాట్సప్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. జూన్ 2వ తేదీ నెల్లూరు, విజయమహల్ గేట్ దగ్గర ఉన్న ఎంసిఎస్ కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, ముఖ్యఅతిథులుగా యాదవ ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

## పేద పిల్లలకు ఆటవస్తువులు



పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరినాథ్, తన మనవరాలి పుట్టినరోజు సందర్భంగా గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల శ్రీ సరస్వతి శిశు మందిరంలోని పిల్లలకు 20వేల రూపాయల విలువచేసే ఆటవస్తువులను అందజేశారు. పేదలకు వస్త్రదానం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మెన్ షేక్ రియాజ్‌అహ్మద్, కళ్యాణసాయి, మల్లెమాల మురళీరెడ్డి, వాకాటి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమానికి శ్రీకారం చుట్టిన మహానేత.. ఎన్టీఆర్

## నందమూరి శతజయంతి వేడుకల్లో కొనియాడిన టిడిపి నేతలు



ప్రజా సంక్షేమానికి ఆద్యుడు మహానేత ఎన్టీఆర్ అని, రెండు రూపాయలకే కిలో బియ్యం ఇవ్వడంతో పాటు, పేదవాడికి కూడు, గుడ్డ, గూడు కల్పించాలని తపించారని, వృద్ధులకు పింఛన్లు, రైతన్నలకు రాయితీలు ఇచ్చి వారి జీవితాలను మెరుగుపరచేందుకు కృషిచేశారని, ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల గుండెల్లో చిరస్మరణీయ నేతగా ఎన్టీఆర్ స్థానం సంపాదించుకున్నారని టిడిపి నాయకులు కొనియాడారు. నెల్లూరులోని ఓ కల్యాణ మండపంలో ఈనెల 21న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు పెద్దఎత్తున జరిగాయి. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టిడిపి నేతలు ఎన్ఎండి ఫరూక్, మాజీ శాసనసభాపతి ప్రతిభా భారతి, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, టిడిపి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర తదితరులు పాల్గొని వేదికపై ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం, ఎన్టీఆర్ జీవిత విశేషాలను వివరించారు. ఎన్టీఆర్ యుగపురుషుడని, తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడిన నేత ఎన్టీఆర్ అని కీర్తించారు. నదులు అనుసంధానం చేసి వేలాది ఎకరాలకు సాగునీరందించిన అపర భగీరథుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. ఇప్పుడు పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్‌లను వైకాపా ప్రభుత్వం తొలగించేసిందని, రానున్న రోజుల్లో ప్రజలు తెలుగుదేశం పార్టీని గెలిపించు కోవాలని, చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం టిడిపి ముఖ్య నాయకులు ప్రతిభా భారతి, ఫరూక్, ఆలపాటి, కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మిలను సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీకి సేవలు చేస్తున్న సీనియర్ నాయకులను సత్కరించారు. మాజీమంత్రి తాళ్లపాక రమేష్‌రెడ్డి, తాళ్ళపాక అనూరాధ, మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్ కుమార్ జడ్పీ మాజీ ఛైర్మెన్ చెంచలబాబుయాదవ్, నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, మాలేపాటి సుబ్బానాయుడు, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, డాక్టర్ జడ్. శివప్రసాద్, పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గన్నారు.



## బెంగుళూరులో ఎన్టీఆర్ శతజయంతి

యుగపురుషుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు మే21న బెంగుళూరులో వేడుకగా జరిగాయి. బెంగుళూరులోని టీడీపీ ఫోరం, తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీమంత్రి బండారు సత్యనారా యణమూర్తి, బెంగుళూరు రాజరాజేశ్వరినగర్ శాసనసభ్యులు మునిరత్న, మాజీ శాసనసభ్యుడు ప్రభాకర్‌చౌదరి, శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, కర్ణాటక తెలుగు అకాడమీ అధ్యక్షులు ఆర్‌వి హరీష్, ప్రత్తిపాటి ఆంజనే యులు, కర్ణాటక టీడీపీ కో-ఆర్డినేటర్ రావి మోహన్‌చౌదరి, ప్రముఖ టీడీపీ యువనేత గురజాల జగన్‌మోహన్, బెంగుళూరు టీడీపీ ఫోరం ముఖ్యులు హాజరై నందమూరి తారకరామారావుకు శ్రద్ధాంజలి ఘటించి, ఆయన ప్రజలకు చేసిన సేవలను కొని యాడారు. ఈ సందర్భంగా కర్ణాటక టీడీపీ కో-ఆర్డినేటర్ రావి మోహన్‌చౌదరిని బండారు సత్యనారాయణమూర్తి, కంచర్ల శ్రీకాంత్ తదితరులు సత్కరించారు.

# బాధితులకు న్యాయం చేయాలి

## పోలీసులకు జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి సూచన



జిల్లాలోని సీనియర్ సిటిజన్ల హక్కులను కాపాడాలని, వారికి భద్రత కల్పించాలని జిల్లా ఎస్పీ డా.కె.తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. ఈనెల 22న నెల్లూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన 'స్పందన' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆస్తులను పంచుకుని తల్లితండ్రులను నిర్లక్ష్యం చేస్తున్న పిల్లలకు, ఆస్తుల కోసం తల్లితండ్రులను వేధించేవారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని, వారు వినిపించు కోనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉద్యోగాల పేరుతో మోసం చేసేవారిని, ప్రేమ పేరుతో నయవంచన చేసేవారిని వదలవద్దని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరకట్న వేధింపులు, అనుమానాస్పద మృతి, హత్య తదితర నేరాలకు సంబంధించిన కేసుల్లో లోతుగా దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలికితీయాలని చెప్పారు. తొలుత స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిశీలించి అర్జీదారుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నిర్ణీత గడువులోగా స్పందన అర్జీలను పరిష్కరించకుంటే చర్యలు తప్పవని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారితో గౌరవప్రదంగా మాట్లాడాలని పోలీసు అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ హిమవతి, ఎస్సీఎస్టీ సెల్ డిఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ డిఎస్పీ పి.వీరాంజ నేయరెడ్డి, ఏఆర్ డిఎస్పీ ఎం.గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## 29న 'ప్రజా చైతన్య సభ'

తెలుగు రాష్ట్రాల్లో పరిపాలన తెలుగులోనే జరగాలని కోరుతూ మే 29వ తేది ఉదయం 10 గంటలకు నెల్లూరు టౌన్‌హాల్ ప్రాంగణంలోని ఏసీ హాల్లో 'ప్రజా చైతన్య సభ' జరుగుతుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు విఠపు బాలసుబ్రమణ్యం. తెలుగు భాష ఉద్యమ సమైక్య గౌరవాధ్యక్షులు సామల రమేష్‌బాబు, అధ్యక్షులు గారపాటి ఉమామహేశ్వరరావు, చలంచర్ల భాస్కర్‌రెడ్డి, డాక్టర్ పాతూరి అన్నపూర్ణ, ఏ.జయప్రకాష్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సభలో సాహితీవేత్తలు, రచయితలు, తెలుగు భాషాభిమానులు పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

## జలదంకిలో వైభవంగా గ్రామదేవతల జాతర

### గంగమ్మ, లేదోటమ్మలకు పెద్దఎత్తున ఊరేగింపు



మండల కేంద్రమైన జలదంకిలో ఉప్పువాగు ఒడ్డున వెలసివున్న గ్రామదేవతలు గంగమ్మ, లేదోటమ్మ అమ్మవార్ల జాతర ఈనెల 22న అత్యంత వైభవంగా జరిగింది. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. యాదవకులానికి చెందిన పెద్దలు అమ్మవార్ల జాతరకు అంకురా ర్పణ చేశారు. గ్రామదేవతలను శోభాయమనంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రధానవీధుల్లో పెద్దఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భజనలు, కోలాటాలు, బాణసంచా వేడుకలతో గ్రామం కోలాహలంగా మారింది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జలదంకి ఎస్ఐ వీరేంద్ర బాబు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేసి పర్యవేక్షించారు.

## అనంతసాగరంలో 'వలంటీర్లకు వందనం'

మండల కేంద్రమైన అనంతసాగరంలో ఈనెల 22న 'వలం టీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఓ మధు సూదన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సచివాలయం పరిధిలో ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్లను సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకా లను ప్రజలకు అందించడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. మండలాధ్యక్షురాలు సంపూర్ణ, పంచాయతీ కార్యదర్శి మోహన్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### జ్వాలాముఖి అమ్మవారి వేడుకలు 28 నుంచి

జిల్లాలోని సుప్రసిద్ధమైన తోటపల్లిగూడూరు మండలం వరిగొండ గ్రామంలో కొలువైవున్న శ్రీ జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానంలో మే 28 నుంచి 30వ తేది వరకు వార్షిక వేడు కలు ఘనంగా జరుగనున్నాయి. ఈ సందర్భంగా ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేకపూజలు, కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

### డీసీపల్లిలో.. చుక్కల దుప్పి మృతి

మర్రిపాడు మండలంలోని డిసిపల్లి టోల్‌ప్లాజా వద్ద ఈనెల 22న ఓ చుక్కల దుప్పి ప్రమాదవశాత్తూ మరణించింది. రోడ్డుమీద వెళ్తున్న వాహనాల కిందపడి చనిపోయింది. మండు టెండల్లో అటవీప్రాంతంలో తాగేందుకు నీళ్ళు లేక దాహంతో అలమటిస్తూ అనేక వన్యప్రాణులు రోడ్డుమీదకొచ్చి ప్రమాదాలకు గురై చనిపోతున్నాయంటూ గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

### 'విశ్వమాత' ఆధ్వర్యంలో పేదలకు చేయూత

నెల్లూరులోని విశ్వమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న పేదలకు పండ్లు, బిస్కెట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆ ఫౌండేషన్ అధ్యక్షురాలు దూబిశెట్టి కల్యాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నగరంలోని తబలా వాద్యసంగీతకారుడు రవిబాబు పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు.

### కొమరికలో మొలకపోలేరమ్మకు ప్రత్యేక పూజలు

ఇందుకూరుపేట మండలంలోని కొమరిక గ్రామంలో కొలువై ఉన్న గ్రామదేవత మొలకపోలేరమ్మకు గ్రామస్తులు పెద్దఎత్తున ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 23న అమ్మవారి జాతర జరగనుండగా, ప్రారంభసూచకంగా 22న విశేష హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### తక్కెళ్ళపాడులో పోలేరమ్మకు పొంగళ్లు

వింజమూరు మండలం ఊటకూరు పంచాయతీలోని తక్కెళ్ళపాడులో గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారికి ఈనెల 22న పెద్దఎత్తున పొంగళ్ళు నిర్వహించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. పెద్దసంఖ్యలో గ్రామస్తులు అమ్మవారి గుడికి వచ్చి ప్రదక్షిణలు చేసి, పొంగళ్లు వండి నైవేద్యంగా సమర్పిం చారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండేలా అనుగ్రహించాలని మొక్కుకున్నారు.

### ఆత్మకూరులో విద్యుత్‌మీటర్ రీడర్ల ఆందోళన

విద్యుత్‌శాఖలో విద్యుత్ మీటర్ రీడర్లుగా పనిచేస్తున్న తమకు జీతభత్యాలు, ఇతరత్రా వృత్తిపరమైన సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించాలని కోరుతూ ఆత్మకూరు విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద ఈనెల 22న మీటర్‌రీడర్లు ఆందోళన చేపట్టారు. సిఐటియు నాయకులు హజరత్, శివప్రసాద్ తది తరులు పాల్గొని మీటర్‌రీడర్లకు తమ మద్దతు ప్రకటించారు.

### ఉత్తమ వలంటీర్లకు నగదు బహుమతులు

ఉదయగిరి మండలంలోని శకునాలపల్లి, పుల్లాయపల్లి గ్రామాల్లో ఈనెల 22న జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్ర మంలో ఉత్తమ వలంటీర్లకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేసి సన్మానించారు. ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, పలువురు పంచాయతి కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

### మైపాడు లైబ్రరీలో.. వేసవి శిక్షణాశిబిరం

ఇందుకూరుపేట మండలంలోని మైపాడు గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణాశిబిరంలో భాగంగా ఈనెల 22న విద్యార్థులకు, చిన్నారులకు పుస్తకపఠనంపై ఆసక్తి కలిగించారు. అనంతరం పిల్లలకు స్వీట్లు, బిస్కెట్లు పంచిపెట్టారు. గ్రంథాలయ అధికారిణి మంజులత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

### పెనుబల్లి వద్ద దోపిడీ

బుచ్చి నుంచి జొన్నవాడ వెళ్లే రోడ్డులో పెనుబల్లి వద్ద ఈ నెల 22న దోపిడిదొంగలు ఒక వాహనానికి రెండు బైక్‌లు అడ్డంపెట్టి దోపిడీకి పాల్పడ్డారు. వాహనం డ్రైవర్, క్లీనర్‌లను బెదిరించి వారినుంచి 5వేల రూపాయలతో పాటు, వారి సెల్‌ఫోన్లు లాక్కొని పరారయ్యారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# రాజకీయ సాము చేస్తున్న కాషాయ స్వాములు

(మొదటి పేజీ తరువాయి)

ఎవరికైనా విధితమే. ఛత్రపతి శివాజీ వెనుక నిలబడి రాజ్యాన్ని ముందుకు నడిపిన సమర్థ రామదాసు కథ ఎంతో ఆసక్తికరమైనది. నిజానికి ఆధ్యాత్మిక బోధనలతో సమాజాన్ని శాంతి, సహనం, భక్తి మార్గం వైపు నడిపించాల్సిన బాధ్యత మత గురువుల మీద ఉందన్నది ఒప్పుకుని తీరాల్సిన వాస్తవం. వీరిలో కూడా సన్యాసం స్వీకరించిన స్వాములే ఎక్కువ మంది ఉన్నారు. "సన్యస్తం మయ" అంటూ పూర్వాశ్రమానికి తర్పణాలు విడిచి సన్యాసాన్ని స్వీకరించి, సమాజానికి రుజుమార్గాన్ని చూపించేందుకు ముందుకు వస్తారు. ఆర్థిక సంస్కరణల ద్వారా భారతదేశాన్ని ప్రగతి పథం వైపు నడిపించిన పి.వి.నరసింహారావు ప్రధానమంత్రి కాకుండా ఉండి ఉంటే, కుర్తాళం పీఠాధిపతి అయ్యేవారని చాలామందికి తెలియదు. పీఠాధిపతి కావాలన్న తలంపుతో సర్వాన్ని త్యజించిన సమయంలో భగవంతుడు ఆయనకి దేశాన్ని ముందుకు నడిపే బాధ్యతను అప్పగించారని ఆయనని దగ్గరగా ఎరిగిన వారు చెబుతూ ఉంటారు.

ప్రత్యక్ష రాజకీయాల్లో స్వాముల జోక్యం కూడా పీవీ హయాం నుంచే ప్రారంభమైందనే చెప్పుకోవాలి. నాటి రాజకీయాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎవరికైనా ముందుగా గుర్తొచ్చే పేరు చంద్రస్వామి. స్వామీజీగా ఉంటూనే తెరవెనుక ఆయన చేసిన రాజకీయ సాము (స్కాము)ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అప్పట్లో చంద్రస్వామి ఒక్కడే అయితే... ఇప్పుడు రాజకీయాల్లో అలాంటి స్వాములకు కొదవే లేదు. కర్ణాటక రాష్ట్ర రాజకీయాల్లో అయితే స్వాములే రాజ్యాధికారాన్ని నిర్ణయిస్తారంటే.. వారి ప్రభావం రాజకీయాలపై ఏ స్థాయిలో ఉందో మనం ఊహించుకోవచ్చు.

ఇటీవల భారత రాజకీయాలతో పాటు, ప్రత్యేకించి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇలాంటి పరిస్థితే నెలకొంది. గెలవాలంటే కావలసింది ప్రజాభిమానం. కానీ ఇప్పటి రాజకీయ పార్టీలు యాగాలతో అధికారం పొందవచ్చని భావించటం మళ్ళీ ఆటవిక రాజ్యం వైపు వెళుతున్నామనటానికి ఓ ఉదాహరణ మాత్రమే. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజాధనంతో చేసే రాజశ్యామల యాగం ఆయనకు అధికారాన్ని సంపాదించిపెట్టిందని భావిస్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ఇదే జరుగుతోంది. ఇటీవల ఆంధ్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కూడా ప్రభుత్వ ఖర్చులతో విజయవాడలోని క్రీడామైదానంలో చేయించిన యాగం కూడా ఇలాంటిదే. దేశవ్యాప్తంగా పేరుమోసిన ఎంతోమంది స్వాములు వచ్చి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించారు. తిరుమల తిరుపతి దేవస్థానాల చైర్మన్ వై.వీ.సుబ్బారెడ్డి సతీసమేతంగా ఆసాంతం దగ్గరుండి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రాజకీయాల్లో స్వాముల జోక్యం సమాజాన్ని ఏ దిశగా తీసుకువెళుతోందనే విషయాన్ని ఆలోచించదగిన యువతరం చర్చించి అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. తెలంగాణ నుంచి భారతీయ జనతాపార్టీ తరపున బరిలో దిగిన పరిపూర్ణానంద స్వామి ఎందుకు ఓటమి పాలయ్యారు. రాజశ్యామల యాగం గురించి వారికి తెలియకనా. అదే విధంగా, కుల గురువుగా జీయర్‌స్వామి వారిని ఆకాశానికి ఎత్తిన కేసీఆర్ ఉన్నట్టుండి వారిని ఎందుకు విడిచిపెట్టినట్లు....? జీయర్‌స్వామి లాంటి సర్వసంగ పరిత్యాగులకు కేంద్ర ప్రభుత్వం 'పద్మ'అవార్డు ఎందుకు ఇచ్చినట్లు...?? వీటి వెనుక దాగి ఉన్న చిదంబర రహస్యం బహుశా చిదంబరంలో ఉన్న నటరాజ స్వామి కూడా గుర్తించలేరేమో. గత ఎన్నికలలో జగన్ గెలవాలని ప్రత్యేక యాగం చేయించి, జగన్‌ను పవిత్రుణ్ని చేసిన విశాఖ స్వరూపానంద ఇప్పుడు ఆయన పాలన కోరుకుంటున్నారో లేదో తెలియని పరిస్థితి. సన్యాస ధర్మాన్ని మరచిమరీ జగన్‌ను ముద్దాడిన ఆయన, ఇటీవల సింహాచలం చందనోత్సవంలో విమర్శలు గుప్పించటం వెనుక ఆంతర్యం ఏమిటో తెలిసింది కాదు. జగన్ పాలన గురించి గెలిపించే సమయంలో ఈ సర్వసంగపరిత్యాగికి తెలియదనే అనుకోవాలా అనిపిస్తోంది.

భగవాన్ రమణ మహర్షి జీవితంలో జరిగిన ఓ సంఘటనను ఈ సందర్భంగా తప్పకుండా గుర్తు చేసుకుని తీరాలి. ఆ సమయంలో రాష్ట్రపతిగా ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణన్, రమణ మహర్షిని చూడాలని అనుకున్నప్పుడు ఆయన చాలా మామూలుగానే స్పందించారు. రాష్ట్రపతి మిమ్మల్ని చూస్తానని ఢిల్లీ నుంచి కబురంపారు అంటే... "నాకు ఆయనతో పనేమీ లేదే" అంటూ అమాయకంగా సున్నితంగా తిరస్కరించారు. తాత్వికుడిగా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన సర్వేపల్లి రాధాకృష్ణన్, రమణ మహర్షి మాటల్లోని అంతరార్థాన్ని అర్థం చేసుకోగలరు. కానీ, ఇప్పటి రాజకీయ నాయకులు ఆధ్యాత్మికవేత్తల నుంచి ఇలాంటి సమాధానాలను జీర్ణించుకోగలరా. అసలు ఇలాంటి సమాధానం ఇవ్వగలిగే స్వాములను భవిష్యత్‌లో మనం చూడగలమా...? స్వాములు సైతం ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి, ముఖ్యమంత్రులుగా, కేంద్రమంత్రులుగా కొనసాగుతున్న ఆధునిక కాలం ఇది. కొంతమంది పేరుమోసిన జ్యోతిష్యులు, "మమ్మల్ని సంప్రదిస్తే మిమ్మల్ని గెలిపిస్తాం" అంటూ ఇటు అధికార, అటు ప్రతిపక్ష పార్టీ నాయకులను ఆకట్టుకోగలుగుతున్నారంటే, ఈ మఠాధిపతుల ప్రభావం రాజకీయాలపై ఏ స్థాయిలో ఉందో మనం ఊహించుకోవచ్చు.

అది స్వాముల ఆత్మవిశ్వాసమా లేక నేతల మూఢ నమ్మకమా అర్థం కాని అయోమయ పరిస్థితి నెలకొంది. దీనికి ఊతం ఇచ్చింది రాజకీయనాయకులా, స్వాములా అని అడిగితే... కోడి ముందా... గుడ్డు ముందా అన్న ప్రశ్నలా అది మిగిలిపోతుంది.

భౌతిక జీవితాన్ని వదలి, భగవంతుని సేవలో ఆధ్యాత్మిక జీవితం గడిపే స్వాముల జీవితాలు, రాజకీయ నాయకుల జీవితాలు పరస్పర విరుద్ధమైనవి. వారిది నిరాడంబరతతో కూడిన సాధారణ జీవితమైతే, వీరిది ఆర్భాటంతో కూడిన ప్రోటోకాల్ జీవితం. వారు నిత్య సత్యవ్రత పరాయణులైతే... వీరు అవసరాన్ని బట్టి సత్యం కంటే ప్రియమైన మాటలని చెప్పగలిగే ప్రావీణ్యులు. కఠోపనిషత్తులోని ఓ శ్లోకం ఈ రెండు జీవితాల మధ్య ఉండే సన్నటి పొరను మన కళ్ళకు కడుతుంది.

*"శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యమేత*
*స్తౌ సంపరీత్య వివినక్తి ధీరః*
*శ్రేయోహి ధీరోభిప్రేయసోవృణీతే*
*ప్రేయోమందో యోగక్షేమాత్ వృణీతే"*

శుభకరమైనదీ, సుఖకరమైనదీ... ఈ రెండూ మానవుడిని సమీపిస్తాయి. బుద్ధిమంతుడు రెండింటినీ చక్కగా పరిశీలించి వివేచన చేస్తాడు. శ్రేయస్సుకే ప్రాధాన్యత ఇస్తాడు. కానీ బుద్ధిహీనుడు లోభం చేత, ఆసక్తి చేత సుఖకరమైన దానినే కోరుకుంటాడు. ఈ విషయం ఈ తరం స్వాములకు తెలియదంటే నమ్మలేము. ఏది కోరుకోవాలో, ఎంత వరకూ కోరుకోవాలో వారు తెలుసుకుంటే మేలు.

ఈ విషయంలో భారతీయ జనతాపార్టీ ఎప్పుడో ఓ అడుగు ముందుకు వేసింది. ఉమాభారతి లాంటి వారికి మంత్రి పదవులు ఇచ్చింది. యోగి ఆదిత్యనాథ్‌ను ఏకంగా ముఖ్యమంత్రి పీఠం మీద కూర్చోబెట్టింది. తెలంగాణ నుంచి పరిపూర్ణనందస్వామికి అవకాశం ఇచ్చింది. అయితే ఆయన దాన్ని నిలబెట్టుకోలేదు. సాక్షాత్తు ప్రధాన మంత్రి చేతులమీదుగా రామానుజుల వారి విగ్రహావిష్కరణ కార్యక్రమం జరగడం, ఆ వెంటనే 'పద్మ' అవార్డు ప్రకటన రావడంతో జీయర్‌స్వామి భారతీయ జనతాపార్టీకి దగ్గరైనట్టు స్పష్టంగా తేలిపోయింది. ఈ క్రమంలో కేసీఆర్ జీయర్‌స్వామికి పూర్తిగా దూరమైపోయారు. ఇప్పుడు జగన్, కేసీఆర్‌లు విశాఖ శ్రీ శారదాపీఠం స్వరూపానందేంద్ర సరస్వతికి చేరువ అవుతున్నారు. జగన్ స్వరూపానందతో పాటు లక్ష్మీయాగం రూపంలో ఎంతోమంది స్వాముల ఆశీస్సులు పొందుతున్నారు. ఇదంతా తాను హిందూమతాభిమానిని అని చెప్పటమా, లేదంటే నువ్వు కాకుంటే చాలామందే ఉన్నారు అని స్వరూపానందకు సందేశమివ్వడమా అన్నది కాలమే మనకు తెలియజేస్తుంది.

చాలా పార్టీలు, నేతలూ స్వాములను దగ్గరకు తీయటం, దూరంగా విసిరేయటం చరిత్రలో మనకు కనిపిస్తూనే ఉంది. ఇందిరాగాంధీ ధీరేంద్ర బ్రహ్మచారికి ఇచ్చిన విలువ మనకు తెలిసిందే. రాందేవ్ బాబాతో బీజేపీకి ఉన్న సంబంధాలు, కాంగ్రెస్ పార్టీ ఆయన మీద చేసిన దాడులు తెలియనివారెవరూ లేరు. స్వామి అగ్నివేశ్ లాంటి వారు కాషాయం కట్టినా కమ్యూనిస్టు పార్టీలకు గురుతుల్యులు అన్న విషయం చాలామందికి తెలిసినా తెలియనట్టే ఉంటారు. రామ్ విలాస్ వేదాంతి, సాధ్వి నిరంజన్ జ్యోతి, సాధ్వి ప్రాచీ, సాక్షి మహరాజ్, సాధ్వి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ లాంటి వారు బీజేపీని బలపరుస్తూనే ఉన్నారు. కమల్‌నాథ్‌కు, ఆశారాం బాపు మధ్య ఉన్న ఆధ్యాత్మిక సత్సంబంధాలు పత్రికల వాళ్ళకు బాగా తెలుసు. అయితే ఇవన్నీ వారి మధ్య సంబంధాలు బాగున్నంత వరకే. సత్సంబంధాలు చెడిన తర్వాత ఆశారాం బాపుకి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బహుమానం, జయలలిత – కంచి స్వామి మధ్య వచ్చిన విభేధాలు ఎంత తీవ్రమైనవో ప్రతి ఒక్కరూ చూశారు. దేశంలో మెజారిటీ ప్రజలను విస్మరించి వాళ్ళ ఓటు బ్యాంకు కోసమే ఇలాంటి ప్రయత్నాలు అనే విషయం చాలా మంది చెబుతారు. ఆ విధంగా అయితే పరిపూర్ణానంద లాంటి వారు తెలంగాణలో గెలిచి తీరాలి. కానీ ఆ పరిస్థితి లేదు. పోనీ రాజశ్యామల యాగమే చేస్తే గెలుస్తారు అనుకుంటే పార్టీలు ప్రచారం కోసం పాకులాడాల్సిన అవసరమే లేదు.

కర్ణాటకలో మఠాలు అత్యంత శక్తివంతమైనవి. ఒక్కో కులానికి ఒక్కో మఠం ఉంటుంది. ఎన్నికల్లో విజయాన్ని శాసించేది వారే అన్నది బహిరంగ రహస్యం. ప్రజలు ఏ పార్టీకి ఓటు వేయాలన్న నిర్ణయం కూడా మఠాధిపతులదే. అందుకే పలువురు రాజకీయ నాయకులు వారి ఆశీర్వాదం కోసం తరలివస్తుంటారు. కొందరు రాజకీయ నేతలు మఠాల్లో తమ డబ్బును (నలుపో... తెలుపో) దాచిపెడుతుంటారన్నది వాస్తవం. చాలా మంది వ్యాపారులు సైతం మఠాల ద్వారానే తమ డబ్బుకు రక్షణ కల్పించుకుంటూ ఉంటారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇదే పరిస్థితి ఉందనే విషయాన్ని ప్రస్తుత స్వాములు చేస్తున్న రాజకీయ సాము ద్వారా స్పష్టమైపోతుంది. అంతలా రాజకీయ నాయకుల కోసం స్వాములు తపించాల్సిన అవసరం ఏమిటో అర్థం కాదు. ఇలాంటి వారి వల్లే హైందవ ధర్మంలోని అనేక అంశాలు అనుమానాలకు తావిస్తున్నాయి. ధర్మాన్ని నమ్మేవారు కూడా దూరమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితి రాకూడదంటే స్వాముల ఆలోచనా ధోరణిలో మార్పు రావాలి.

ధర్మానికి ఆపద ఏర్పడినప్పుడు అవతారం ఎత్తుతానని భగవంతుడు కూడా తెలియజేశాడు. స్వాముల పని కూడా అలాంటిదే. పాలకులు తప్పు చేసినప్పుడు ఎత్తి చూపాలే తప్ప, పాలకులే పరమాత్మ సంభూతులు అని ప్రచారం చేయకూడదు. లోక కళ్యాణం కోసం హోమాలు, యజ్ఞాలు చేయాలే తప్ప... రాజకీయ హోమాలు చేయటం వారి గొప్పతనాన్ని తక్కువ చేస్తుందనే విషయాన్ని గ్రహించాలి. వారు భగవంతుని ప్రతినిధులే తప్ప, రాజకీయ పార్టీలకు బ్రాండ్ అంబాసిడర్లు కాదు అనే విషయాన్ని గుర్తించాలి. వేదాధ్యయనం, భగవంతుని నామస్మరణతో నోటిని పునీతం చేసుకోవాలి తప్ప, రాజకీయ నేతలను కీర్తించి ప్రక్షాళన చేసుకోవలిసిన పరిస్థితి తెచ్చుకోకూడదు. వారి మేధస్సు ప్రజల సమస్యలను తీర్చేందుకు గానీ... పాలకుల రాజకీయ సమస్యలకు పరిష్కారం చూపటానికి కాదు. ఈ విషయం కాషాయ స్వాములు తెలుసుకుని, తమ రాజకీయ సాముకి స్వస్థి చెప్పాల్సిన అవసరం ఉంది.

ఇక ఈ విషయంలో మేల్కోవాల్సిన బాధ్యత ప్రజల మీదే ఎక్కువగా ఉంది. రాజకీయ నాయకులదేముంది వారికి అవసరమైతే ఏ పనైనా చేస్తారు. ఎంతైనా దిగజారుతారు. ప్రజల్లో చైతన్యం వస్తే ఇలాంటివేవీ నిలబడవు. ఎన్నికల్లో గెలుపోటములు ప్రజలు నిర్ణయించాలే తప్ప, స్వాములు, సన్యాసిలు కాదు. చేసిన అభివృద్ధి తిరిగి పట్టం కట్టాలే తప్ప యాగాలు, యజ్ఞాలు కావు. చాలామంది పార్టీ అధినేతలు ఎన్నికల తరుణంలో ఈ మఠాధిపతుల కాళ్ళ మీద పడుతున్నారు. వారు మళ్ళీ గెలిస్తే యాగ ఫలం, గెలవకుంటే కర్మఫలం అని సరిపెట్టుకుంటున్నారు. ఎవరైనా చెప్పేది ఈ మాటే. ఆధ్యాత్మిక కేంద్రాలను వ్యక్తిత్వ వికాస కేంద్రాలుగా తీర్చిదిద్దాలే తప్ప, మానసిక రోగుల నిలయాలుగా మార్చకూడదు. భక్తి, రాజకీయం కలిస్తే జరిగే ప్రమాదం ఇదే. ఎవరి పరిధులు వారికి ఉంటాయి. స్వాములను గౌరవించటం రాజకీయ నాయకుల బాధ్యత అయితే, సరైన మార్గంలో వారికి దిశానిర్దేశం చేయటం స్వాముల కర్తవ్యం. ఎవరి పని వారు సక్రమంగా చేస్తే , దేశం సస్య శ్యామలంగా ఉంటుంది.

సర్వేజనా సుఖినోభవన్తు....!

## కల్యాణ వైభవం...!



యుకె యాడ్స్ అధినేత ఆనిమెళ్ళ ఉమాకుమార్ - అనూరాధల కుమారుడు
**బాల చైతన్య కుమార్ - శ్రీ నవీన** (అల్లీపురం వాస్తవ్యులు గండవరం విజయులురెడ్డి - భారతిల కుమార్తెల
వివాహం మే 21వ తేదీ నెల్లూరులోని కె.పి.ఆర్ గ్రాండ్‌లో జరిగింది.
నవ దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

## నటుడు సుమన్‌కి 'సింహపురి సంస్కృతి సమాఖ్య' ఎన్టీఆర్ అవార్డ్

పద్మశ్రీ డా. నందమూరి తారకరామారావు శత జయంతి సందర్భంగా నెల్లూరులోని సింహపురి సంస్కృతి సమాఖ్య ఆధ్వర్యంలో పలువురుకి పురస్కారాలు అందజేయనున్నట్లు సమాఖ్య వ్యవస్థాపక కార్యదర్శి, సమ్మోహన సామ్రాట్ రాంజీ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక టౌన్‌హాలులో మే 28వ తేదీ సాయంత్రం 6.00 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు డా. సుమన్‌కు ఎన్‌టిఆర్ అవార్డు బహుకరిస్తామని, సభకు 'లాయర్' పత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారని, బీజేపీ నేత కర్నాటి ఆంజనేయరెడ్డి ఆత్మీయఅతిథిగా, ముఖ్యఅతిథిగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం జనరల్‌మేనేజర్ యం.రాజాకిషోర్, విశిష్ట అతిథిగా ఎస్.వి.రమణారెడ్డి పాల్గొంటారని రాంజీ తెలియజేశారు.

# ఎమ్మెల్యే ప్రసన్న చొరవతో.. బుచ్చికి ఇక మహర్దశ



బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీకి మహర్దశ వచ్చేసింది. ఈ పంచాయతీ అభివృద్ధికి అవసరమైన నిధులను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కొరత లేకుండా ప్రభుత్వం నుంచి మంజూరు చేయించుకుని తెస్తుండడంతో నియోజకవర్గ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 23న ఆయన బుచ్చిలోని 6,7 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. బుచ్చిలో తాగునీటి కష్టాలు తీర్చాలంటూ వైకాపా నగర అధ్యక్షుడు టంగుటూరు మల్లికార్జున్ తన దృష్టికి తీసుకురాగా, ఆ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలపడంతో, సిఎం వెంటనే స్పందించి 85 కోట్ల రూపాయలు మంజూరు చేశారని ఆయన ప్రజలకు వివరించారు. అందుకు ప్రధాని మోడీకి, సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్తున్నానని అన్నారు. మరో 80 కోట్ల రూపాయల వ్యయంతో బుచ్చిలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. ఇంకో 30 కోట్ల రూపాయల వ్యయంతో బుచ్చిలో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. బుచ్చి మండల పరిధిలోని పెనుబల్లి గ్రామంలో పొదుపు గ్రూపులకు 6.34 లక్షల ఆసరా చెక్కులు అందించామని ఆయన తెలిపారు. వైకాపా సీనియర్ నాయకుడు ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, బుచ్చి నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, తహాశీల్దార్ సుధీర్, ఏపిఎం లలితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ఏపీయూడబ్ల్యూజే నిరసన ప్రదర్శన

రాష్ట్రంలో పాత్రికేయులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈనెల 22న నెల్లూరులో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. జర్నలిస్టులపై దాడులు చేస్తున్న వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని కోరుతూ నెల్లూరు ప్రెస్‌క్లబ్ దగ్గర నుండి బయలుదేరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పాత్రికేయునికి అక్రిడిటేషన్ మంజూరు చేయాలని వారు ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు వల్లూరు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు దయాశంకర్, రవి, కోశాధికారి హనోక్, సహాయ కార్యదర్శి ఖాన్, ఎలక్ట్రానిక్ మీడియా సంఘం అధ్యక్షులు రమేష్‌బాబు, స్థానిక పత్రికల ప్రతినిధులు, ఫోటోగ్రాఫర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భూ హక్కు పత్రాలు యజమానులకే ఇవ్వాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమంపై రెవిన్యూ అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణన్ హెచ్చరించారు. జిల్లాలో జరుగుతున్న రీ సర్వే మొదటి, రెండు దశల అమలుపై ఆర్ డి ఓ లు, తహాసిల్దార్లు, సర్వేయర్లతో ఈనెల 23న కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష చేశారు. రీ సర్వే చేసిన తర్వాత కొన్ని చోట్ల భూహక్కు పత్రాలు ఆ యజమానులకు కాకుండా వారి బంధువులకు ఇస్తున్నట్లుగా తన దృష్టికి వచ్చిందని, సంబంధిత యజమానులకు మాత్రమే ఆ పత్రాలు ఇవ్వాలని, ఇతరులకు ఇవ్వవద్దని సూచించారు. భూహక్కు పత్రాలకు సంబంధించి భూ యజమానుల ఫోటోలు అప్‌లోడ్ వేగవంతం చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.కూర్మనాధ్ మాట్లాడుతూ రీ సర్వే, సర్వేరాళ్ళ ఏర్పాటు త్వరగా పూర్తి చేయాలని, వేసిన రాళ్లకు జియో టాగింగ్ చేయాలన్నారు. రీ సర్వేలో ఏవైనా పొరపాట్లు జరిగితే తహాశీల్దార్లు బాధ్యత వహించాల్సి వుంటుందన్నారు. ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### మనుబోలు పోలీస్‌స్టేషన్‌ను

# తనిఖీ చేసిన ఎస్పీ

మండల కేంద్రం మనుబోలు పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఈనెల 23న ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఎస్ఐ ముత్యాలరావుతో మండల స్థాయిలో నేర సమాచారాన్ని, శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. పెండింగ్ కేసులు లేకుండా చూడాలని, సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. అనంతరం అక్కడ కొత్తగా నిర్మించిన రిసెప్షన్ భవనాన్ని పరిశీలించారు.

# కామాక్షితాయి హుండీ ఆదాయం.. రూ.32.46 లక్షలు



జిల్లాలోని ప్రసిద్ధమైన జొన్నవాడ కామాక్షితాయి దేవాలయానికి మార్చి 28 నుంచి మే 23వ తేది వరకు, ఈ 57 రోజులకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 32,46,742 రూపాయల రాబడి వచ్చింది. ఆలయ అధికారులు ఈనెల 23న హుండీలను లెక్కించగా ఆ నగదుతో పాటు 141.200 గ్రాముల బంగారు, 141.500 గ్రాముల వెండి వస్తువులను కూడా సమర్పించారని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. జిల్లా దేవాదాయశాఖ అధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి వారు, ఆలయ అధికారులు ఈ లెక్కింపులో పాల్గొన్నారు.

# కలం కంటే నోరు పదునైంది...!



మనందరికీ తెలుసు... 'కత్తి కంటే కలం గొప్పది' (pen is mightier than sword) అనే నానుడి చాలా కాలంగా కూడా ప్రచారంలో ఉన్నదే!

ఈ నానుడిని ఎన్ని విధాలుగా అయినా అన్వయించుకోవచ్చు.

కత్తి ఒకటి పట్టుకుని జనం మీద పడే ఊర రౌడీ కంటే... కలం ఒకటి పట్టుకుని ఊరు మీద పడే 'జర్రలిస్టు' ఎక్కువ భయపెడతాడు అని సూత్రీకరించుకోవచ్చు. ఊర రౌడీ పోలీసోడికి భయపడితే, 'జర్రలిస్టు'కు పోలీసోడు భయపడతాడు అని కూడా సూత్రీకరించుకోవచ్చు.. అందుకే, కత్తి కంటే... కలం గొప్ప అన్నారు.

ఈ మాటను ముందుగా మనం అనలేదు. ఓ తెల్లోడు అన్నాడు. దాదాపు నాలుగు వందల ఎనభై సంవత్సరాల కిందటే... ఎడ్వర్డ్ బుల్వర్ (Edward Bulwar) అనే బ్రిటిష్ రచయిత మొదటిసారిగా ఈ వాక్యాన్ని ఒక నాటకంలో వాడాడు. Conspiracy అనే ఈ నాటకం ఆ రోజుల్లో సూపర్‌హిట్ అయింది. అప్పటి బ్రిటిష్ మహారాణి విక్టోరియా కూడా ప్రత్యేకంగా ఈ నాటకాన్ని తిలకించారు. నాటకంలోని ఒక పాత్ర ద్వారా పలికించిన ఈ వాక్యం, అనంతర కాలంలో విశ్వవ్యాప్తమైంది.


నిజానికి, ఒక సానుకూల (పాజిటివ్) దృక్పథంలో ఈ నానుడి పుట్టింది. సామాజికంగా... లేదా రాజకీయంగా పరివర్తన కోసం ఒక హింసా అంతరార్థం.

ఫ్రెంచ్ చక్రవర్తిగా చరిత్రలో నిలిచిపోయిన నెపోలియన్ బోనాపార్టీ కూడా వెయ్యి తుపాకీల కంటే... నాలుగు 'ప్రభుత్వ వ్యతిరేక' వార్తా పత్రికలు ప్రమాదకరం అని వ్యాఖ్యానించాడు. రాను, రాను ఈ వాక్యం విశ్వవ్యాప్తమైంది. చివరికి కొన్ని విశ్వవిద్యాలయాలు సైతం ఈ వాక్యాన్ని తమ 'ట్యాగ్ లైన్'గా కూడా వాడడం మొదలుపెట్టాయి. ఉదాహరణకు, జపాన్‌లోని టోక్యో నగరంలో గల KEIO యూనివర్సిటీ, ఈ వాక్యాన్ని తన ట్యాగ్ లైన్‌గా వాడుతోంది.

కత్తి కంటే కలం అంత బలమైనది కాబట్టే, ప్రపంచ వ్యాప్తంగా పాలకులు పత్రికలకు, స్వతంత్ర భావాలున్న రచయితలు, కవులు, కళాకారులకు భయపడుతుంటారు.

ప్రెస్ సెన్సార్‌షిప్ అంటే ఎలా ఉంటుందో అనే విషయం మనకు 1975 నుంచి అనుభవంలోకి వచ్చింది. 1975లో దేశంలో అత్యయిక పరిస్థితిని విధించిన ఇందిరాగాంధీ.... పనిలో పనిగా పత్రికలపై ఆంక్షలు విధించారు. పత్రికలు ఏమి రాయాలో, ఏమి రాయగూడదో నిర్దేశించారు. కొన్ని పత్రికలను మూసేయమన్నారు. కలంపై ఈ 'టిరనీ' రెండేళ్లపాటు సాగింది. కత్తిపై కలం సాధించిన విజయం ఇది.

'ఆ రెండు పత్రికలు...' అంటూ వై.ఎస్. రాజశేఖరరెడ్డి 'ఈనాడు, ఆంధ్రజ్యోతి' పత్రికలను లక్ష్యంగా చేసుకుని అప్పట్లో బహిరంగ సభల్లో మాట్లాడడం మనకు తెలుసు. ఇప్పుడు, ఆయన కుమారుడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి కూడా అదే ఒరవడిని కొనసాగిస్తున్నారు. తన తండ్రి రెండింటిని అంటే.. కొడుకు వాటికి మరో రెండింటిని జత చేసి 'దుష్ట చతుష్టయం' అంటూ దులిపేస్తున్నాడు.




టీవీ విప్లవం మొదలైన కొత్తల్లో... దూరదర్శన్ వార్తలు చదవడంతో, కలంపై నోరు పైచేయి సాధించే క్రమం మొదలైంది. సాయంకాలం 7 గంటలకు ప్రసారామయ్యే దూరదర్శన్ తెలుగు వార్తల కోసం ఎదురుచూడడం పరిపాటి అయిపోయింది.

ప్రైవేట్ టీవీ ప్రసారాలు ఉనికిలోకి రావడంతో, 'ప్రైవేటు' వార్తా ప్రసారం ప్రాచుర్యం పెరగడం ప్రారంభమైంది. ఇక, యూట్యూబ్ అనేది ఉనికిలోకి వచ్చిన తరువాత వార్తా ప్రపంచం రూపురేఖలు మారిపోయాయి. రెగ్యులర్ మీడియా అని మనం అనుకునే టీవీ ఛానెల్స్‌తో పాటు, వందల సంఖ్యలో సాంఘికాసాంఘిక ఛానెల్స్ బయలుదేరాయి.

కలంతో రాయడానికి కొంత చదువు, విజ్ఞానం, రచనా సామర్థ్యం, లాజికల్‌గా విషయాన్ని పాఠకుల దృష్టికి తీసుకు రాగలిగిన సామర్థ్యం, అక్షరం మీద కమాండ్ ఉండాలి. దీనిని జర్నలిజం అనుకునే వారం మనం ఇంత కాలం.

ఇప్పుడు కాలం మారింది. కలంకు కాలం చెల్లింది. కలం స్థానాన్ని నాలుక ఆక్రమిస్తోంది. రాసేవాడికీ సత్తా ఉండడం లేదు.... చదివే వాడికీ ఓపిక ఉండడం లేదు. మాట్టాడమూ, అది వినడమూ తేలిక అయిపోయాయి. నోటికి ఏది వస్తే అది మాట్టాడడమే!

ఇప్పుడు కొత్త రకం 'జర్రలిజం' అయిపోయింది. పేషెంట్ కోరుకున్న మందే డాక్టర్ కూడా ఇచ్చాడు అన్నట్టుగా, వినడానికి అలవాటు పడిన జనానికి.... నాలుకతో కథనాలు వండి వార్చడమే జర్నలిజం అయిపోయింది. దీంతో, ఎవరైనా 'జర్రలిస్ట్' అయిపోవచ్చు. కలం స్థానంలో కావలసింది ఓ పదునైన నాలుక. అనర్గళంగా నోటి తుప్పరను నాలుగువైపులా వెదజల్ల గలిగిన సామర్థ్యం.

'రైటింగ్ జర్నలిజం' స్థానాన్ని, 'టాకింగ్... బార్కింగ్ జర్రలిజం' ఆక్రమించేసింది. మళ్లీ ఇందులో పోటీ. తోటివాడు తొడ కోసుకుంటే, మనం మెడ కోసుకోవాలనే స్పీడు.

సమాజంపై ఈ విచ్చలవిడి 'నాలుక దాడి' ముందు ముందు ఎటు దారి తీస్తుందో తెలియదు. ఎందుకంటే, ఎవరైనా జర్రలిష్టే. ఒక్కొక్కరి చేతుల్లో ఒక్కొక్క యూ ట్యూబ్ ఛానల్. నో ఆస్కర్... నో టెల్లర్.

ఈ జర్రలిస్ట్ అరాచకానికి కొద్దో... గొప్పో... ఫుల్‌స్టాపో, కామానో పెట్టగలిగిన 'టెక్నిక్' యూ ట్యూబ్ చేతుల్లోనే ఉన్నదేమో అనిపిస్తుంటుంది ఒక్కొక్కసారి.

యూ ట్యూబ్‌లో లోడ్ చేసే ప్రతి వీడియోకు, 'నిముషానికి ఇంత' అని ఫీ వసూలు చేస్తే, (మొబైల్ ఫోన్‌లో టాక్‌టైమ్‌కు ఛార్జీలు ఉన్నట్టుగా) సమాజంపై ఈ 'నాలుక దాడి' తగ్గుముఖం పట్టవచ్చు. దాని పదునూ అదుపులోకి రావచ్చు. లేకపోతే, గోదావరి వరదల్లో అన్నీ కొట్టుకుపోయినట్టుగా, ఈ నాలుకల పదునులో పడి సమాజంలోని సమస్త విలువలూ కొట్టుకుపోవచ్చు. సమాజం సర్వ భ్రష్టమైపోవచ్చు

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

# కళ్యాణ వైభవం...!



ధీర్ఘకాలంగా బిఎంఆర్ సంస్థలలో డైరెక్టర్‌గా పనిచేస్తూ, బీద మస్తాన్‌రావుకి కుడిభుజంగా సంస్థ కార్యకలాపాలను తన భుజస్కందాలపై మోస్తున్న దొడ్ల వేణుగోపాల్‌రెడ్డి - వంశీప్రియల కుమారుడు **నిఖిల్ రెడ్డి - నిహారిక** (పొట్టెంపాడు వాస్తవ్యులు పార్లపల్లి వెంకటసుబ్బారెడ్డి - దీపల కుమార్తెల పరిణయం మే 24వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో వైభవంగా జరిగింది. ఈ వేడుకకు రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, పలువురు రాజకీయ, పారిశ్రామిక ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# 'రియల్' కుబేరులు

(మొదటి పేజీ తరువాయి)



బొమ్మిరెడ్డి సోదరులు... సురేంద్ర, సురేష్, సునీల్



జీవీకే రెడ్డి

రూపాయల స్థిరాస్థితో 16వ ర్యాంకులో నిలవగా, ఎస్.సుబ్రహ్మణ్యంరెడ్డి 5,880 కోట్ల సంపదతో 17వ స్థానంలో నిలిచారు. అలయన్స్ మరియు అర్బన్ రైజ్ సంస్థల ఛైర్మెన్ మనోజ్ నంబూరుకి 3,900 కోట్ల ఆస్థిపరుడిగా 29వ ర్యాంకు లభించింది. అదే సంస్థకు చెందిన బొమ్మిరెడ్డి కుటుంబం కూడా 3,900 కోట్ల స్థిరాస్తిపరులుగా తొలి 50 ర్యాంకులలో స్థానం దక్కించుకుంది. వ్యాపార దిగ్గజం జీ.వీ.కే.కి ఉన్న అనేక సంస్థలలో ఒక భాగమైన రియల్ విభాగానికి 78వ ర్యాంకు లభించింది.

## 3 రాష్ట్రాల్లో విస్తరించిన అలయన్స్ / అర్బన్ రైజ్

బెంగళూరు కేంద్రంగా తమ వ్యాపార లావాదేవీలను ప్రారంభించిన అలయన్స్ సంస్థ నిర్మాణరంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సాధించుకుంటూ అభివృద్ధి పథంలో పయనిస్తోంది. బెంగళూరుతో పాటు చెన్నై, ఆ తరువాత హైదరాబాదులలో సంస్థ కార్యకలాపాలను విస్తరించుకుని తమ అనుబంధ సంస్థ 'అర్బన్ రైజ్' ద్వారా అధిక లావాదేవీలను నిర్వహిస్తూ సొంత ఇంటి కోసం కలలు కనేవారి ఆకాంక్షలు నెరవేరుస్తోంది. ప్రపంచంలోనే అగ్రగామి రియల్‌ఎస్టేట్ మరియు నిర్మాణ సంస్థగా ఎదగడమే తమ లక్ష్యం అన్న నినాదంతో బలమైన పునాదులు వేసుకుంటూ ముందుకు సాగుతోంది. మనోజ్ నంబూరుతో పాటు పరిశ్రమిస్తున్న సునీల్ బొమ్మిరెడ్డి, ఆయన సోదరులు సురేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డితో సహా నలుగురూ నెల్లూరీయులే.

## 10 మంది తెలుగు రియల్ రారాజులలో 7 మంది నెల్లూరీయులు...!

అపర్ణ అధినేతలు సి.వీ.రెడ్డి, ఎస్.ఎస్.రెడ్డి, జీ.వీ.కే. గ్రూప్‌కి ఉన్న రియల్‌ఎస్టేట్ విభాగ అధిపతి జీ.వీ.కే.రెడ్డిలతో పాటు అలయన్స్ / అర్బన్ రైజ్ సారధులు నలుగురిని కలిపితే రియల్ విభాగంలో అగ్రగణ్యులుగా నిలచిన మొత్తం 10 మంది తెలుగువాళ్ళలో 7 మంది మన నెల్లూరీయులే కావడం నెల్లూరీయుల సమర్ధతకి, వ్యాపార దక్షతకి నిదర్శనం. సప్త కుబేరులకు 'లాయర్' అభినందనలు.

# దివ్యాంగులకు అండగా.. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమం

## గొలగమూడిలో కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ప్రారంభం

### - ఇ.ఓ పి.బాలసుబ్రహ్మణ్యం వెల్లడి



దివ్యాంగులకు అండగా నిలవాలనే లక్ష్యంతో వెంకటాచలం మండలం గొలగమూడి గ్రామంలో కొలువై ఉన్న అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమం ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని ఆశ్రమ ఇఓ పి.బాలసుబ్రహ్మణ్యం వెల్లడించారు. ఈనెల 24న గొలగమూడిలోని శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమ వైద్యశాలలో భగవాన్ మహావీర్ జైన్ రిలీఫ్ ఫౌండేషన్ ట్రస్టు అధినేత పీసీ పరాఖ్‌తో కలసి ఆయన దివ్యాంగుల కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇఓ మాట్లాడుతూ, ఈ కేంద్రానికి వచ్చేందుకు నెల్లూరు-చిత్తూరు జిల్లాల నుంచి తొలిరోజున పలువురు తమ పేర్లు నమోదు చేసుకున్నారని, వైద్యులు సూచించిన తేదీ ప్రకారం వారు ఇక్కడికి వస్తే వసతితో పాటు ఉచిత భోజనం, వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. పేదలకు వైద్యసేవలు అందించాలనే ఆలోచనతో భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమ వైద్యశాలను నిర్మించి, ప్రతిరోజు ఆయుర్వేదం, అల్లోపతి, ఫిజియోథెరపీ సేవలను అందజేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఆశ్రమం ఆధ్వర్యంలో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసి ప్రజలకు ఉచితంగా సేవలందిస్తున్నామని తెలిపారు. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశయాల్లో ప్రధానమైనవి 'ఆకలైనవారికి అన్నం పెట్టాలయ్యా', 'ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలయ్యా' అనే స్వామివారి మానవీయ సూక్తులను పాటిస్తూ ఆశ్రమం ఆధ్వర్యంలో నిరంతరం అన్నప్రసాద వితరణ చేస్తున్నామన్నారు.

మహావీర్ ట్రస్ట్ అధినేత పీసీ పరాఖ్ మాట్లాడుతూ, ఆశ్రమ వైద్యశాలలోనే దివ్యాంగులకు అవసరమైన అన్ని పరికరాలను తయారుచేసి ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి 'బర్డ్' హాస్పిటల్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ జగదీష్, బర్డ్ ఆసుపత్రి ఉపకరణాల తయారీ విభాగం మాజీ ఇన్‌చార్జి రాజ్, ఆశ్రమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# జూన్ 8 నుంచి చెంగాళమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు

## - భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్న సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య





తెలుగు-తమిళ ప్రజల ఆరాధ్యదైవం, సూళ్ళూరుపేట గ్రామశక్తి, చల్లనితల్లి శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు వేల సంఖ్యలో అమ్మవారి ఉత్సవాలకు తరలివస్తారు కనుక, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటుచేస్తున్నారు. ఇటీవల బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను కూడా ఎమ్మెల్యే సంజీవయ్య, ఆలయ ఛైర్మెన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఇఓ ఆళ్ళ శ్రీనివాసులు రెడ్డి, పాలకమండలి సభ్యులు కలసి విడుదల చేశారు. జూన్ 8వ తేది నుంచి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని, గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి వాటంబేడు రోడ్డులోని 25 ఎకరాల స్థలంలో అమ్మవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 8వ తేది రాత్రి బలిహరణ కార్యక్రమంతో ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుందని, 9వ తేది సాయంత్రం 4 గంటలకు సుళ్ళు ఉత్సవం, రాత్రి అశ్వవాహనోత్సవం జరుగుతాయని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.

అదేవిధంగా, 10వ తేది సాయంత్రం 4 గంటల నుంచి సుళ్ళు ఉత్సవం, మహిషాసురమర్ధిని ఉత్సవం, రాత్రి 10 గంటలకు సింహవాహన సేవ నిర్వహిస్తామన్నారు. 11వతేది సాయంత్రం 4గంటలకు సుళ్ళు ఉత్సవం, నందివాహన సేవ, 12వ తేదీ సాయంత్రం 7 గంటలకు కాళంగి నదిలో తెప్పోత్సవం, అనంతరం రాత్రి 8 గంటలకు పుష్పపల్లకి సేవ నేత్రపర్వంగా నిర్వహిస్తామని తెలిపారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

# ఏసీబీకి చిక్కిన..'లంచావతారం'

## ○ దుత్తలూరులో వీఆర్‌ఓ అరెస్ట్

**లంచం తీసుకుంటూ ఓ వీఆర్‌ఓ ఏసీబీ అధికారుల వలకు చిక్కిపోయాడు. పొలానికి సంబంధించిన మ్యుటేషన్ కోసం వస్తే, 10 వేల రూపాయలు లంచం అడగడంతో పొలం సొంతదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడం, వారు వల వేసి పట్టుకోవడం జరిగిపోయాయి. వీఆర్‌ఓ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. దుత్తలూరులో ఈనెల 24వ తేది బుధవారం జరిగిన ఈ సంఘటన రెవెన్యూ వర్గాల్లో, ఉద్యోగవర్గాల్లో సంచలనం కలిగింది. ఏసీబీ అధికారులు తెలిపినమేరకు వివరాలిలా ఉన్నాయి.**

దుత్తలూరు మండలం సోమలరేగడ గ్రామానికి చెందిన వంగూరు రాధాకృష్ణారెడ్డి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. 2022లో అదే గ్రామంలో పొలం కొనుక్కుని రిజిస్ట్రేషన్ చేయించాడు. ఆ పొలానికి సంబంధించి మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకుని, పలుసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా అధికారుల్లో చలనం లేదు. ఇన్‌చార్జి వీఆర్‌ఓ హజరత్ మస్తాన్‌ను ఈ విషయమై ప్రస్తావించగా, 10 వేల రూపాయలు లంచం డిమాండ్ చేశాడని, దీంతో లంచం ఇవ్వడానికి ఇష్టం లేని రాధాకృష్ణారెడ్డి తమను ఆశ్రయించాడని ఏసిబి అధికారులు పేర్కొన్నారు. ఏసీబీ అధికారులు వల పన్ని సిద్ధంగా ఉంచారు. వీఆర్‌ఓ అడిగిన మేరకు ఆ డబ్బు ఇస్తుండగా అధికారులు దాడిచేసి వీఆర్‌ఓను పట్టుకున్నారు.

ఈ దాడుల్లో ఏసీబీ డిఎస్పీ డిఆర్‌ఆర్ మోహన్, సీఐలు జిఎల్ శ్రీనివాసరావు, డి.రమేష్‌బాబు, జి.వేణు, టి.కిరణ్‌తో పాటు ఏఎస్‌ఐ సురేష్‌బాబు, హెడ్‌కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

# జిల్లాలో 9 మంది తహాశీల్దార్లకు..బదిలీలు

జిల్లాలో తొమ్మిదిమంది తహాశీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఈనెల 24న ఉత్తర్వులిచ్చారు. కావలి ఆర్డీఓ కార్యాలయంలో పరిపాలనాధికారిగా ఉన్న టి.వెంకటసునీల్‌ను 'నుడా' స్పెషల్ తహాశీల్దారుగా, ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న దూబగుంట మధుసూదనశర్మను నెల్లూరు ఆర్డీఓ పరిపాలనాధికారిగా, నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న పి.సుశీలమ్మను కలెక్టరేట్‌లో తహాశీల్దారుగా నియమించారు. ఏఎస్‌పేట తహాశీల్దారుగా పనిచేస్తున్న ఎం.సుభద్రను ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం పరిపాలనాధికారిగా, అనంతసాగరం తహాశీల్దార్‌గా పనిచేస్తున్న ఏవి రమణరావును ఏఎస్‌పేట తహాశీల్దార్‌గా నియమించారు. సైదాపురం తహాశీల్దారుగా ఉన్న వి.విజయలక్ష్మిని కలువాయికి, దగదర్తి తహాశీల్దారు ఎన్ శ్రీనివాసులును సైదాపురానికి, దగదర్తిలో డెప్యూటి తహాశీల్దార్‌గా పనిచేస్తున్న ఎన్ చెంచయ్యను దగదర్తిలో పూర్తి అదనపు బాధ్యతలతో తహాశీల్దారుగా నియమించారు. అనంతసాగరం మండలంలో డెప్యూటి తహాశీల్దారుగా పనిచేస్తున్న టి.ప్రదీప్‌ను కూడా అదే మండలానికి పూర్తి అదనపు బాధ్యతలతో తహాశీల్దారుగా నియమితులయ్యారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com